నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

శ్రీనగర్‌లో ఉగ్రవాది హతం.. జవాన్ వీరమరణం

శ్రీనగర్ : జమ్మూ కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలోని నియంత్రణ (ఒనీఅ) ఉగ్రవాది చొరబాటుకు యత్నించాడు. ఈ క్రమంలో ఉగ్రవాదిని హతమార్చగా.. ఈ ఘటనలో ఓ సైనికుడు వీరమరణం పొందినట్లు ఆర్మీ వర్గాలు తెలిపాయి. కుప్వారా జిల్లాలోని నియంత్రణ రేఖలోని తంగ్‌ధర్ సెక్టార్‌లో శుక్రవారం ఉదయం అనుమానాస్పద కదలికలను ఆర్మీ సైనికులు గుర్తించినట్లు రక్షణ వర్గాలు పేర్కొన్నాయి.

దీంతో చొరబాటు ప్రయత్నాలను విఫలం చేసేందుకు ఆపరేషన్ చేపట్టారు. ఈ సమయంలో ఉగ్రవాదులు భద్రతా దళాలపై కాల్పులు జరిపారు.

దీంతో బలగాలు సైతం కాల్పులు జరుపడంతో ఓ ఉగ్రవాది మృతి చెందాడు. ఈ ఆపరేషన్‌లో ఓ ఆర్మీ జవాన్ ప్రాణాలు కోల్పోయాడని, ఆ ప్రాంతంలో తనిఖీలు కొనసాగుతున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

హైదరాబాద్ | శనివారం 9-7-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 274 | పేజీలు:6 | వెల: రూ.1/-

తెలంగాణాలో కుండపోత.. ఏడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

హైదరాబాద్, జులై 8:బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తుండగా దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మాత్రం కుండపోతగా వాన కురుస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం పడుతోంది. భారీ వర్షాలతో వరదలు పోటెత్తున్నాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. పలు ప్రాంతాల్లో పంటపొలాల్లోకి వరద నీరు చేరింది. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు తెలంగాణలోని ఏడు ప్రాంతాల్లో అతి భారీ వర్షం కురిసింది. 42 ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మిగిలిన ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలో వర్షం కురిసింది. ముసురు పట్టింది.

సూర్యాపేట జిల్లా ఆత్మకూరులో అత్యధికంగా 179 మిల్లిమీటర్ల వర్షం కురిసింది. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచలో 147, సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో 132, ఖమ్మం జిల్లా కూర్నవల్లిలో 120, బోనకల్ మండలం రావినూతలలో 120, వైరాలో 119, ఖానాపూర్ లో 118 మిల్లమీటర్ల భారీ వర్షం కురిసింది. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం, మదిర, సూర్యాపేట జిల్లా మద్దిరాల, నాగారం మండలాల్లోనూ 100 మిల్లిమీటర్లకు పైగానే వర్షం కురిసింది. శుక్రవారం తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. శుక్రవారం నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, నల్గొండ, సూర్యాపేట, మహబూబా బాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ , వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ఇచ్చింది. పలు ప్రాంతాల్లో కుండపోతగా వర్షం కురుస్తుందని హెచ్చరించింది. భారీ వర్షాలకు వరదలు పోటెత్తుండటంతో ప్రాజెక్టులు, చెరువుల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కడెం, గడ్డెన్న సహా పలు ప్రాజెక్టు గేట్లు ఎత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు వరద భారీగా వస్తోంది.

రూ. 134.46 కోట్లతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎస్టీపీ ప్లాంట్లు

హైదరాబాద్, జులై 8:తొలిసారిగా రాష్ట్రవ్యాప్తంగా 20 ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల్లో మురుగుజల శుద్ధి ప్లాంట్లను (ఎస్టీపీ) ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు పర్యావరణ, ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ఆస్పత్రుల నుంచి వెలువడే వ్యర్థ జలాలను శుద్ధి చేసేందుకు ప్రభుత్వం ఈ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నది. ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు చొరవతో తొలివిడుతగా రాష్ట్రవ్యాప్తంగా 20 ప్రధాన ఆసుపత్రుల్లో ఎస్టీపీలు నిర్మించనున్నారు. ఇందుకు ప్రభుత్వం రూ.134.46 కోట్లు ఖర్చు చేయనున్నది. ఇందులో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వాటా రూ.52.59 కోట్లు. ఈ ఎస్టీపీలను ప్రభుత్వం అత్యాధునిక హైబ్రిడ్ యాన్యువిటీ మోడల్ (హెచ్‌ఏఎం)లో నిర్మిస్తున్నది. మరో నెల రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేయనున్నారు. అనంతరం నిర్మాణ పనులు ప్రారంభిస్తారు. నిర్మాణ సంస్థలే పదేండ్ల పాటు ప్లాంట్లను నిర్వహించనున్నాయి.

ఈ ఆస్పత్రుల్లోనే ఎస్టీపీలు..

హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా, టిమ్స్, నీలోఫర్ ఆస్పత్రులతో పాటు మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, సూర్యపేట, నల్గొండ, ఆదిలాబాద్ రిమ్స్, సంగారెడ్డి, వనపర్తి, మంచిర్యాల, మహబూబాబాద్, జగిత్యాల, రామగుండం, భద్రాద్రి కొత్తగూడెం, నాగర్ కర్నూల్, సిద్దిపేట మెడికల్ కాలేజి, ఖమ్మం, కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో మురుగు నీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు.

కాలుష్యాన్ని అరికట్టేందుకే..

ఆస్పత్రుల నుంచి వివిధ రూపాల్లో విడుదలయ్యే వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా బయటకు విడుదల చేయడం వల్ల నీటి కాలుష్యం జరుగుతుంది. ఆపరేషన్ థియేటర్, ల్యాబ్స్, పేషంట్ల బెడ్ షీట్స్ ఉతికే సమయంలో, వార్డులను శుభ్రపరిచే సమయంలో వచ్చే వ్యర్థ జలాలను ముందుగా డీస్ ఇన్‌ఫెక్ట్ చేసి ఎస్‌టీపీలకు పంపుతారు. అక్కడ నీటిని శుద్ధి చేసి, పునర్వినియోగించుకునే విధంగా లేదా బయటికి వదులుతారు. ఇలా చేయడం వల్ల నీటి వనరులు కలుషితం కాకుండా ఉంటాయి.

రెవెన్యూ సదస్సులపై కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, జులై 8: సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సుల నిర్వహణపై కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు ఇతర రెవెన్యూ అధికారులతో సీఎస్ సోమేశ్ కుమార్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 15 నుంచి నిర్వహించే మండల స్థాయి రెవెన్యూ సదస్సులను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు.

రెవెన్యూ సదస్సు షెడ్యూల్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన సూచించారు. సదస్సుల నిర్వహణ వేదికల వద్ద మొబైల్ ఈ–సేవా కేంద్రం, ఇంటర్నెట్, ఇతర మౌలిక సదుపాయాలతో పాటు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో అందే అన్ని దరఖాస్తులకు రసీదులు ఇవ్వాలని చెప్పారు. ఈ నెల 11న ముఖ్యమంత్రి నిర్వహించనున్న కలెక్టర్ల సమావేశానికి, జిల్లా అధికారులు సమగ్ర సమాచారంతో రావాలని కోరారు.

చరిత్రలో నేటినిజం



కం॥ కళదుదు– "వసంత శివశం
కళపుదు కాదె" కానగినట్టి కళను దలచుచును
కళయు గళ మెచ్చి కొలుతును
"గురుదత్తు" గ ఖ్యాతిగాన్న కోమల హాసదయున్!!

–రాధశ్రీ

(జులై 9 గురుదత్తు జయంతి...)



సెల్: 9494481210

మహంకాళి అమ్మవారి బోనాలకు భారీగా ఏర్పాట్లు : మంత్రి తలసాని

హైదరాబాద్, జులై 8:హైదరాబాద్, సికింద్రాబాద్‌కే పరిమితమైన బోనాలు నేడు విశ్వవ్యాప్తం అయ్యాయని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ నెల 17న నిర్వహించే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. బోనాల ఉత్సవాల నిర్వహణపై మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, మహమూద్ అలీతో కలిసి తలసాని శ్రీనివాస్ యాదవ్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన మహంకాళి అమ్మవారి ఉత్సవాలకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ఎంతో గొప్పగా బోనాల ఉత్సవాల నిర్వహణ కొనసాగుతోందన్నారు. బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం రూ. 15 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గతంలో కంటే అత్యధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని తలసాని స్పష్టం చేశారు. 18న రంగం, అంబారీపై అమ్మవారి ఊరేగింపు ఉంటుందని చెప్పారు.

6 కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాలు : మంత్రి గంగుల కమలాకర్

హైదరాబాద్, జులై 8: తెలంగాణలో వెనకబడిన వర్గాలకు సీఎం కేసీఆర్ ఆత్మ గౌరవం కల్పించారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. ఏక సంఘంగా ఏర్పడిన మున్నూరుకాపు, పెరిక, తెలంగాణ మరాఠ మండలి, కుమ్మరి శాలివాహన, విశ్వబ్రాహ్మణ, ఆరెటి క్షత్రియ కుల సంఘాలకు ఆత్మగౌరవ భవన నిర్మాణ అనుమతి పత్రాలను మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్ గౌడ్ కలిసి అందజేశారు.

నగరంలోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. ఇప్పటికే 24 కుల సంఘాలు ఏక సంఘంగా ఏర్పడి అనుమతి పత్రాలు తీసుకున్నాయని తెలిపారు. మిగతా కులాలు సైతం మరో వారం రోజుల్లోపు ఏక సంఘంగా ఏర్పడాలని పిలుపునిచ్చారు. ఈ చివరి అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. లేనిపక్షంలో వాటి నిర్మాణాలకు టెండర్లు పిలిచి వారం తర్వాత ప్రభుత్వమే చేపడుతుందని తెలియజేశారు. దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా 41 కులాలకు హైదరాబాద్ నడిబొడ్డున వేల కోట్లు విలువ చేసే 82.30 ఎకరాల స్థలాన్ని కేటాయించడమే కాకుండా భవన నిర్మాణాన్ని సైతం ఆయా కుల సంఘాలకే అప్పగించి నిధుల్ని సైతం ఇస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే అన్నారు.

ఈ అవకాశాన్ని వినియోగించుకుని వెనుకబడిన వర్గాల ఆత్మ గౌరవం సూచించేలా కులాల ఇష్ట ప్రకారం ప్రత్యేక నమూనాలతో భవనాలను నిర్మించుకోవాలన్నారు. ఈ ఆత్మగౌరవ భవనాలు హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఆయా కుల సంఘాలకు విద్యావరంగాను, సామాజికంగానూ, సాంస్కృతికపరంగానూ, వసతిలో కూడా అత్యుత్తమ సేవలు అందిస్తాయన్నారు.

మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. మహాత్మ జ్యోతిబాపూలే చేసిన రీసెర్చ్ ప్రకారం మన కులాలన్నీ ఒకే ఇంటి నుండి ఉద్భవించాయని తెలిపారు. వృత్తుల పరంగా వేరువడి తర్వాత కులాల రూపాన్ని సంతరించుకున్నాయన్నారు. అందుచేత వెనుకబడిన వర్గాలంతా ఒక్కటే అని, ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కులంలో ఎదిగే వాళ్లకు అండగా నిలబడాలి కానీ అడ్డుపడకూడదని ఆకాంక్షించారు. కుల రహిత సమాజం కోసం పాటుపడుతూ కులాంతర వివాహాలు ప్రోత్సహించాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రోద్బలంతో ఒకే తాటిపైకి వచ్చిన వెనుకబడిన కులాలు ఇకముందు అదే ఆత్మగౌరవాన్ని ప్రదర్శించాలన్నారు.

టీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ వేలకోట్ల విలువైన స్థలాల్ని, నిధుల్ని వెనుకబడిన వర్గాలకు ఇచ్చారని పేర్కొన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కులం ఆత్మగౌరవం ప్రతిఫలించేలా భవన నిర్మాణాలను చేసుకోవాలన్నారు.

మాజీ స్పీకర్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ.. కుల సంఘాల్ని ఆత్మగౌరవ భవనాల కోసం ఏకతాటి పైకి తెచ్చిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మంత్రి గంగుల కమలాకర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఐక్యంగా ఉండడం అభివృద్ధికి దారితీస్తుందని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయం కూడా అదే అని అన్నారు.

ఈ సందర్భంగా భవన నిర్మాణ అనుమతి పత్రాలు అందుకున్న కుల సంఘాలు మంత్రులను, ఇతర ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కోరుకంటి చందర్, సాహిత్య అకాడమీ ఛైర్మన్ జూలూరి గౌరీశంకర్, జల వనరుల సంస్థ ఛైర్మన్ వి.ప్రకాశ్, బీసీ కమిషన్ సభ్యుడు ఉపేంద్ర, ఇతర బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, ఆరు కుల సంఘాల నేతలు ప్రతినిధులు, పెద్ద ఎత్తున బీసీలు పాల్గొన్నారు.

ఐఎఫ్ఎస్ ర్యాంకర్ రాజును సన్మానించిన మంత్రులు



హైదరాబాద్, జులై 8:తొలి ప్రయత్నంలోనే ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)లో ఆలిండియా 86వ ర్యాంకు సాధించిన కాసర్ల రాజును మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ సన్మానించారు. ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో అరణ్య భవన్ లో ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో మంత్రులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఆర్ఐ తరపున లక్ష రూపాయాల ప్రోత్సాహకాన్ని రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ అడవులు, పర్యావరణ రక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు.

అటవీ విద్యను ప్రోత్సహించాలన్న సంకల్పంతో పాటు జాతీయ స్థాయి అధికారులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సీఎం ములుగులో అటవీ కళాశాల, పరిశోధనా సంస్థను నెలకొల్పారన్నారు. ఈఅఫీఎ స్థాపించిన అనతి కాలంలోనే కాసర్ల రాజు వంటి వారు తొలి ప్రయత్నంలోనే ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ సాధించడం అటవీ కళాశాలకు గర్వకారమన్నారు.

జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం సూరారం గ్రామంలోని ఓ సాధారణ కుటుంబం నుంచి వచ్చిన రాజు ఎంతో కష్టపడి ఐఎఫ్ఎస్ సాధించి.. పేదరికం ప్రతిభకు అడ్డంకి కాదని నిరూపించాడన్నారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు వీలుగా విద్యార్థులకు ఉన్నతమైన విద్యా బోధనను అందించేందుకు కృషి చేస్తున్న అటవీ శాఖ ఉన్నాతధికారులు, ఈఅఫీఎ డీన్ ప్రియాంక వర్గీస్, అధ్యాపకులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.ఐఎఫ్ఎస్ ర్యాంకర్ రాజు మాట్లాడుతూ..తనకు తన పేరెంట్స్ ఎంతో సపోర్ట్ ఇచ్చారన్నారు.

అలాగే ఈఅఫీఎ నుంచి మంచి గైడెన్స్ లభించిందన్నారు. తన జర్నీలో భాగమైన ప్రతి ఒక్కరికి ఈ క్రెడిట్ దక్కుతుందని, వారందరికీ రాజు కృతజ్ఞతలు

కార్యక్రమంలో అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్, పీసీసీఎఫ్ (కంపా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్) లోకేష్ జైస్వాల్, అదనపు పీసీసీఎఫ్ ఎంసీ పర్గెయిన్, డిప్యూటీ డైరెక్టర్ కె. శ్రీనివాస్, డీసీఎఫ్ ఎ.నరసింహ రెడ్డి పాల్గొన్నారు.

నాగార్జున వర్సిటీ డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల..

హైదరాబాద్, జులై 8: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఈ ఏప్రిల్ లో నిర్వహించిన డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. అదనపు ఉప కులపతి ఆచార్య రాజశేఖర్ ఈ ఫలితాలను విడుదల చేశారు. పరీక్షలకు మొత్తం 33 169 మంది విద్యార్థులు హాజరుకాగా, 18 243 మంది ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థులు ఫలితాలను ఏఎన్యూ డాట్ ఏసి డాట్ ఇన్ అంతర్జాలం నుంచి తెలుసుకోవచ్చని ఏ సి ఈ . ఆర్. ప్రకాష్ రావు తెలిపారు. రీవాల్యుయేషన్, పర్సనల్ వెరిఫికేషన్, జవాబు పత్రం జిరాక్స్ కాపీ కోసం దరఖాస్తుకు ఈ నెల 16 గడువుగా నిర్ణయించామని ఆయన చెప్పారు. విద్యార్థులు రీవాల్యుయేషన్ దరఖాస్తులను వారివారి కళాశాలల్లో ప్రిన్సిపల్స్ కు సమర్పించాలని సూచించారు.

విద్యార్థులు పర్సనల్ లోన్ వెరిఫికేషన్ దరఖాస్తులు పైన వారివారి కళాశాలల ప్రిన్సిపాల్స్ చేత సంతకం చేయించి విశ్వవిద్యాలయంలోని యుజి పరీక్షల సమన్వయకర్త ఆఫీసులో సమర్పించాలని వివరించారు. అలాగే జవాబు పత్రం జిరాక్స్ కాపీ కోసం విద్యార్థులు దరఖాస్తు మీద వారి వారి కళాశాల ల ప్రిన్సిపాల్ చేత సంతకం చేయించి విశ్వవిద్యాలయంలోని యూజీ పరీక్షల సమన్వయకర్త కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. విద్యార్థులు సమర్పించిన రీవాల్యుయేషన్ దరఖాస్తులను ఆయా కళాశాలలు ఈ నెల 19 లోపు విశ్వవిద్యాలయంలోని పరీక్షల సమన్వయకర్త కార్యాలయంలో సమర్పించాలన్నారు.

హైదరాబాద్‌లో ఆదివారం ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్, జులై 8: బక్రీద్ పర్వదినం దృష్ట్యా ఆదివారం(జులై 10) నాడు హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సిటీ పోలీసులు తెలిపారు. మీరాలం ట్యాంక్ ఈద్గా, మాసాబ్ ట్యాంక్‌లోని హాకీ గ్రౌండ్ పరిసరాల్లో ఉదయం 8 గంటల నుంచి 11:30 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.

–పురానాపూల్, కామాటిపుర, కిషన్ బాగ్ నుంచి మీరాలం వైపు వచ్చే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని సూచించారు. అయితే ప్రార్థనలకు వచ్చే వారి వాహనాలను బహదూర్ పురా ఎక్స్ రోడ్డు మీదుగా అనుమతించనున్నారు. కేటాయించిన పార్కింగ్ ప్రాంతాల్లోనే వాహనాలను నిలపాలని పోలీసులు సూచించారు. జూపార్క్ తో పాటు ఆ పరిసరాల్లో వాహనాలను పార్కింగ్ చేసుకోవచ్చని చెప్పారు.

–శివరాంపల్లి, దానమ్మ హట్స్ నుంచి ప్రార్థనల కోసం మీరాలం వైపు వచ్చే వారు తమ వాహనాలను దానమ్మ హట్స్ ఎక్స్ రోడ్డు వరకు అనుమతించనున్నారు. సాధారణ ట్రాఫిక్‌ను దానమ్మ హట్స్ ఎక్స్ రోడ్డు నుంచి శాస్త్రిపురం, ఎన్ఎస్ కుంట మీదుగా మళ్లించనున్నారు.

–కాలపత్తార్ నుంచి వచ్చే వారు తమ వాహనాలను కాలపత్తార్ లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్ వరకు మాత్రమే అనుమతించనున్నారు. సాధారణ ట్రాఫిక్‌ను మోచి కాలనీ, బహదూర్ పురా, షంషీర్ గంజ్, నవాబ్ సాహిబ్ కుంట మీదుగా మళ్లించనున్నారు.

–మెహిదీపట్నం, లక్డీకాపూల్ నుంచి వచ్చే వాహనాలను మాసాబ్ ట్యాంక్ ఫ్లై ఓవర్ కిందకు అనుమతించరు. కేవలం ప్రార్థనల కోసం వచ్చే వారిని మాత్రమే అనుమతించనున్నారు. మెహిదీపట్నం నుంచి బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1 వైపు వెళ్లే వాహనదారులు.. మాసాబ్ ట్యాంక్ ఫ్లై ఓవర్, అయోధ్య జంక్షన్, ఖైరతాబాద్ ఆర్టీఏ ఆఫీస్, తాజ్ కృష్ణ హోటల్ మీదుగా వెళ్లాలి.

జపాన్ మాజీ ప్రధాని షింజో అబే హత్య

న్యూఢిల్లీ, జులై 8: జపాన్ మాజీ ప్రధాని షింజో అబే హత్యకు గురయ్యారు. ఆయనపై ఇవాళ హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే. నారా సిటీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ఓ వ్యక్తి వెనుక నుంచి వచ్చి తుపాకీతో కాల్చాడు. షింజో అబే ఛాతి, మెడలోకి బుల్లెట్లు దిగినట్లు తెలిసింది. అబేను హుటాహుటిన ఆస్పిటల్‌కు తరలించి వైద్యం అందించారు. కానీ 67 ఏళ్ల షింజో అబే హాస్పిటల్‌లో ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ధ్రువీకరించారు. కాల్పులు జరిపిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 5.03 నిమిషాలకు షింజో మృతిచెందినట్లు హాస్పిటల్ వర్గాలు పేర్కొన్నాయి.

రాజీనామా చేసినా.. రాజకీయాల్లో యాక్టివ్‌గానే

షింజో అబే తన ప్రధాని పదవికి 2020లో రాజీనామా చేశారు. ఆరోగ్య కారణాల రీత్యా ఆయన పదవికి రాజీనామా చేశారు. కానీ ఆయన మాత్రం రాజకీయంగా యాక్టివ్‌గా ఉన్నారు. ఆయన రెగ్యులర్‌గా మీడియాలో కనిపించేవారు. కరెంట్ అఫైర్స్ గురించి చర్చించేందుకు ఆయన తరుచూ మీడియాలో కనిపించేవారు. నాటో సభ్యుల తరహాలోనే అణ్వాయుధాల షేరింగ్ అంశాన్ని జపాన్ చర్చించాలని ఫిబ్రవరిలో ఓ డిబేట్‌లో తెలిపారు. ఉక్రెయిన్‌పై రష్యా అటాక్ చేసిన నేపథ్యంలో ఆయన ఆ అభిప్రాయాన్ని వినిపించారు.

శుక్రవారం నారా పట్టణంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సయమంలో ఓ ఆగంతకుడు షింజోపై కాల్పులు జరిపాడు. ఎగువ సభకు ఎన్నికల నేపథ్యంలో లిబరల్ డెమోక్రటిక్ పార్టీ తరపున షింజో ప్రచారం నిర్వహించారు. నారా తర్వాత క్యోటో, సైతామాలో ఆయన ప్రచారం చేయాల్సి ఉంది. జపాన్ చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా చేసిన వ్యక్తిగా అబేకు గుర్తింపు ఉన్నది. 2006 నుంచి 2007, ఆ తర్వాత 2012 నుంచి 2020 వరకు ఆయన ఆ దేశ ప్రధానిగా చేశారు.

రాయల్ ఫ్యామిలీ..

షింజో అబేది పేరుగల కుటుంబం. ఆయన తండ్రి షింతారో అబే ఆ దేశ విదేశాంగ మంత్రిగా చేశారు. ఇక అబే తాత ఆ దేశ ప్రధానిగా చేశారు.మాజీ ప్రధాని నొబుషుకే కిషి మనువడే షింజో అబే. రాజకీయంగా షింజో ఫ్యామిలీకి ఘన చరిత్ర ఉంది. అయినా జపాన్ రాజకీయాల్లో అత్యంత శక్తివంతమైన వ్యక్తిగా షింజో కొనసాగారు. ప్రధానిగా ఉన్న సమయంలో షింజే తన ఆర్థిక విధానాలతో ఆకట్టుకున్నారు. విదేశాంగ, ఆర్థిక విధానాల వల్ల ఆయనకు ఎబినామిక్స్ అన్న పేరు వచ్చింది.

షింజో మృతికి నివాళిగా రేపు భారత్‌లో సంతాప దినం

న్యూఢిల్లీ, జులై 8: జపాన్ మాజీ ప్రధాని షింజో అబే ఇవాళ హత్యకు గురయ్యారు. షూటర్ కాల్పుల్లో గాయపడ్డ ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. షింజో అబే మృతికి నివాళిగా శనివారం భారత్‌లో సంతాప దినం పాటించనున్నారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ ప్రకటించారు. షింజో మేటి రాజకీయవేత్త అని, అసాధారణ నేత అని, సాటిలేని పరిపాలనా కొనసాగించారని మోదీ అన్నారు. తమ మధ్య ఎన్నో ఏళ్ల సంబంధం ఉన్నట్లు ప్రధాని మోదీ తన ట్విట్టర్‌లో గుర్తు చేశారు. మిత్రుడు షింజో అబే మృతి పట్ల షాక్‌కు గురయ్యానని, తనకు మాటలు రావడం లేదన్నారు. జపాన్ ప్రజల కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. షింజో అబేకు ఆర్థిక అంశాలపై లోతైన పట్టు ఉందని, ఆయన విదేశీ విధానం కూడా తనను ఎంతో ఆకర్షించినట్లు మోదీ తెలిపారు. ఇటీవల జపాన్ వెళ్లినప్పుడు అబేను కలిసినట్లు తెలిపారు. అబే మృతి పట్ల భారత దేశం సంతాపం ప్రకటిస్తోందని, కష్టసమయంలో జపాన్ సోదరసోదరీమణులకు సంఘీభావంగా నిలుస్తుందని మోదీ తెలిపారు. షింజో పట్ల ఉన్న తమకు అమితమైన గౌరవం ఉందని, ఆయన మృతికి నివాళి జూలై 9వ తేదీన జాతీయ సంతాపం దినంగా పాటించనున్నట్లు మోదీ తెలిపారు. తన ట్విట్టర్‌లో ఇటీవల షింజోతో దిగిన ఫోటోను మోదీ షేర్ చేశారు.

అనంతపురం జిల్లాలో.. అనుమానాస్పద స్థితిలో ఎలుగుబంటి మృతి

అమరావతి, జులై 8: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లాలో ఎలుగుబంటి అనుమానాస్పద స్థితిలో చనిపోయింది.

జిల్లాలోని కళ్యాణదుర్గం మున్సిపల్ పరిధిలోని ముదిగల్లు సమీపంలో ఎలుగుబంటి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. గమనించిన గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు మృతి చెందిన ఎలుగుబంటిని పరిశీలించారు. విషపూరిత ఆహారం తినడం వల్లే ఎలుగుబంటి మృతి చెంది ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు.

సాహిత్యం | ఆహ్వానం | సంగీతం



శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయ గానసభ
సంయుక్త ఆధ్వర్యంలో

ప్రముఖ రచయిత
శ్రీ శ్రిష్టి శేషగిరి గారు
రచించిన



నేను కాలాన్ని

కవితా సంపుటి
ఆవిష్కరణ మహోత్సవం

తేది : 13-07-2022 బుధవారం సా॥ 6-00 గం॥లకు
వేదిక : శ్రీ త్యాగరాయ గానసభ, కళాసుబ్బారావు కళావేదిక, హైదరాబాద్

ముఖ్య అతిథి : డా॥ కె.వి.రమణాచారి గారు
తెలంగాణా ప్రభుత్వ సలహాదారు

సభాధ్యక్షులు : శ్రీ బైస దేవదాసు గారు
సంపాదకులు, నేటినిజం దినపత్రిక

విశిష్ట అతిథి : శ్రీ కళా వి.ఎస్. జనార్దనమూర్తి గారు
అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గానసభ

ఆత్మీయ అతిథి : శ్రీ పొత్తూరి సుబ్బారావు గారు
సంపాదకులు, సాహితీ కిరణం

పుస్తక పరిచయం : డా॥ లలితవాణి గారు, ప్రముఖ విద్యావేత్త

శ్రీమతి కళా శారద, కార్యదర్శి, శ్రీ త్యాగరాయ గానసభ | బండారుపల్లి రామచందర్ రావు, అధ్యక్షులు, మానస ఆర్ట్స్ | కోకా భవాని, కన్వీనర్, మానస ఆర్ట్స్ | రఘుశ్రీ, కార్యదర్శి, మానస ఆర్ట్స్, 9247108893

ఐన్‌స్టీన్‌ను మించిన ప్రజ్ఞ కలిగిన 9-ఏండ్ల బాలిక

ఆస్టిజమ్ (మూగవ్యాధి) సంబంధ ఆస్పర్జర్ సిండ్రోమ్‌తో బాధపడుతున్న 9-ఏండ్ల మెక్సికన్ బాలిక ప్రపంచంలోనే అత్యంత ఐక్యూ (ఇంటలిజెన్స్ కోషంట్, ప్రజ్ఞా సూచిన) కలిగిన అరుదైన వ్యక్తిగా పేరు గడించడం ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలుగజేస్తున్నది. ఇప్పటికే పాఠశాల విద్య పూర్తి చేసిన బాలిక ప్రస్తుతం రెండు విశ్వవిద్యాలయాల్లో సిస్టమ్స్ ఇంజనీరింగ్ మరియు మాథమాటిక్స్ ప్రధానంగా ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ డిగ్రీలను ఏకకాలంలో అభ్యసిస్తుండడం విశేషం, అభినందనీయం. మెక్సికో నగరానికి చెందిన 9-ఏండ్ల బాలిక 'అదారిటీ పెరేజ్ సాంచేజ్' వ్యక్తిగతంగా ఆస్టిజమ్ వర్గ అనారోగ్యంతో బాధ పడుతున్నప్పటికీ, అన్ని అవాంతరాలను అధిగమిస్తూ 162 ఐక్యూను కలిగి ఉండడం గమనించారు. ప్రపంచ మేటి శాస్త్రజ్ఞులు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్‌లు గరిష్టంగా 160 ఐక్యూను ప్రదర్శించడం గత ఘన చరిత్ర. ఆ అపూర్వ మేధావులను అధిగమిస్తూ 9 ఏండ్ల పెరేజ్ సాంచేజ్ 162 ఐక్యూను సాధించడం అబ్బురంగా తోస్తున్నది. సాధారణంగా 130 ఐక్యూ కలిగిన వ్యక్తులనే అద్భుత మేధావులుగా పరిగణించే దశలో 162 ఐక్యూను 9 ఏండ్ల పెరేజ్ ప్రదర్శించడం అసాధారణం, అనన్యసామాన్యం.

ఆస్టిజమ్ వర్గంలోని ఆస్పర్జర్ సిండ్రోమ్ అనారోగ్యంతో కారణంగా బడిలో తోటి సహచర మిత్రుల నుంచి ఎన్నో అవమానాలు, అవహేళనాలు ఎదుర్కొన్న పెరేజ్ మానసికంగా విద్యాలయం వెళ్లడానికి భయపడుతూ తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యేది. పది మందితో సులభంగా కలువలేని పెరేజ్‌ను చూసి తన సహచర స్నేహితులు 'వీర్డో', 'ఆడ్ బాల్' అంటూ హేళన చేసే వారు. పాఠశాలలో నిద్ర పోవడం, తరగతి చదువుల పట్ల అనాసక్తత ప్రదర్శించడంతో తల్లి 'నల్లెలీ సాంచేజ్' వైద్య నిమిత్తం ఇంట్లోనే ఉంచుకోవడంతో బాలికలోని అద్వితీయ మేధస్సు, అత్యంత ఐక్యూలను గమనించింది. ఇంటిలో కూర్చొని పీరియాడిక్ టేబుల్ (ఆవర్తన పట్టిక)ను కంఠస్థం చేసి అందరినీ ఆశ్చర్యపరచడం జరిగింది. అపూర్వ మేధో సంపత్తితో 3వ ఏట చదవడం, 5వ ఏట ప్రాథమిక పాఠశాల, 6వ ఏట మిడిల్ స్కూల్, 8వ ఏట ఉన్నత పాఠశాల చదువులు పూర్తి చేసింది. ప్రస్తుతం తన 9వ ఏట మెక్సికో విశ్వవిద్యావయాల్లో ఏకకాలంలో సిస్టమ్స్ ఇంజనీరింగ్, గణితశాస్త్ర సంబంధ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ డిగ్రీలను అభ్యసిస్తున్నది. ఉన్నత విద్య అభ్యసిస్తూనే తన జీవిత అనుభవాలను 'డూనాట్ గివ్ అప్ (పోరాటాన్ని ఆపకు)' అనే ఆత్మకథ పుస్తకం రచించగా ఫోర్బ్స్ మెక్సికో 100 అత్యంత ప్రతిభగల శక్తివంతమైన మహిళల జాబితాలో చోటు దక్కించుకుంది.

భవిష్యత్తులో అరిజోనా యూనివర్సిటీలో చేరి అంతరిక్షశాస్త్రం అభ్యసించి వ్యోమగామి కావాలనే తీవ్ర వాంఛను వ్యక్తం చేస్తున్న పెరేజ్ సాంచేజ్ అంతరిక్షంలో విహరించడానికి ఉవ్విలూరుతున్నది. ఇప్పటికే అరిజోనా విశ్వవిద్యాలయ అధ్యక్షులు రాబర్ట్ సి. రాబిన్స్ ప్రవేశ ఆహ్వానం పొందిన పెరేజ్ సాంచేజ్ ఉన్నత చదువులు పూర్తి చేసి అత్యుత్తమ వ్యోమగామి (ఆస్ట్రోనాట్)గా సేవలు అందించాలని కోరుకుందాం, పెరేజ్‌పై మనస్ఫూర్తిగా దీవెనలు కుమ్మరిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

కిన్నెరసానికి పోటెత్తిన వరద.. 6 గేట్లు ఎత్తివేత!

ఖమ్మం, జులై 8: (నేటినిజం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కిన్నెరసాని జలాశయంలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతున్నది. వెంటనే అప్రమత్తమైన అధికారులు శుక్రవారం ఉదయం 6 గేట్లు ఎత్తి 56 వేల క్కుసెక్కులు నీటిని దిగువకు వదిలారు. కిన్నెరసాని రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 407 అడుగులు కాగా.. ప్రస్తుత నీటి మట్టం 404.40 అడుగులు ఉంది. యనంబైల్ చప్టా పై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో కిన్నెరసాని అవతలి వైపు ఉన్న 10 గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. కిన్నెరసాని పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు.

కారు ఢీకొట్టడంతో బాలిక మృతి.. కరీంనగర్ జిల్లాలో ఘటన



కరీంనగర్ , జులై 8: (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కేంద్రంలోని స్టేజీ వద్ద తీవ్ర రోడ్డు ప్రమాదం చోటు చేసుకొంది.. తిమ్మాపూర్ కి చెందిన లోహిని శివాని తిమ్మాపూర్ స్టేజీ వద్ద రోడ్డు పక్కన నిల్చుంది. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అతి వేగంగా శివానిని ఢీకొట్టడంతో కొంతదూరంలో ఎగిరిపడింది.

ఘటనా వివరాలు తెలుసుకున్న పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే చనిపోయిందని అంబులెన్స్ అధికారులు తెలిపారు. బాలికను ఢీకొట్టిన డ్రైవర్ పరారీలో ఉన్నట్లు ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్ రెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎన్ఇపి అమలు అంశంపై ఏర్పాటైన 'అఖిల భారతీయ శిక్ష సమాగమ్' ను ప్రారంభించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 8: 'జాతీయ విద్య విధానం' యొక్క అమలు పై ఈ రోజు న వారాణసీ లో ఏర్పాటైన 'అఖిల భారతీయ శిక్ష సమాగమ్' కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో పాలుపంచుకొన్న వారి లో ఉత్తర్ ప్రదేశ్ గవర్నర్ శ్రీమతి ఆనందీబెన్ పటేల్, ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రులు శ్రీ ధర్మేంద్ర ప్రధాన్, శ్రీమతి అన్నపూర్ణ దేవి, డాక్టర్ శ్రీ సుభాష్ సర్ కార్, డాక్టర్ రాజ్ కుమార్ రంజన్ సింహ్, రాష్ట్ర మంత్రులు, విద్య రంగ ప్రముఖులు మరియు ఇతర సంబంధిత వర్గాల వారు ఉన్నారు.

సభికుల ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, 'అమృత కాలం' తాలూకు ప్రతిజ్ఞల ను నెరవేర్చడం లో ఒక ప్రధానమైన పాత్ర ను మన విద్య వ్యవస్థ మరియు యువతరం పోషిస్తాయి అన్నారు. మహామన మదన్ మోహన్ మాలవీయ గారి కి ప్రధాన మంత్రి వందనాన్ని అర్పించి, సమాగమ్ సత్ఫలితాలు సాధించాలంటూ తన శుభాకాంక్షల ను వ్యక్తం చేశారు. అంతక్రితం ప్రధాన మంత్రి ఎల్ టి కాలేజీ లో అక్షయ పాత్ర మధ్యాహ్న భోజన వంట ఇంటి ని ప్రారంభించారు. తాను మాట్లాడిన విద్యార్థుల యొక్క ప్రతిభ తాలూకు ఉన్నత స్థాయి అనేది ఆ యొక్క ప్రతిభ ను సద్వినియోగ పరచుకోవడానికి కావలసిన ప్రయాస కు ఒక సూచిక గా ఉందని ఆయన అన్నారు.

" 'జాతీయ విద్య విధానం' యొక్క మూలాధారం విద్య ను సంకుచితమైన ఆలోచన ల సరళి నుంచి బయటికి తీసుకు రావడమూ, మరి దాని ని 21 శతాబ్ది తాలూకు ఆధునిక భావాల తో జతపరచడమూను" అని ప్రధాన మంత్రి అన్నారు. దేశం లో వివేకాని కి, ప్రతిభ కు ఎన్నడూ కొదువ లేదు, ఏమైనప్పటికీ బ్రిటిషు వారు ఏర్పరచిన విద్య విధానం భారతదేశ సభ్యత లో ఎన్నడూ ఒక భాగం కాలేకపోయింది అని ప్రధాన మంత్రి అన్నారు. విద్య పరం గా భారతదేశ సభ్యత యొక్క బహుళ పార్శ్వికత్వాన్ని గురించి ఆయన నొక్కి చెప్తూ, మరి ఆ యొక్క కోణం ఆధునిక భారతదేశం విద్య వ్యవస్థ తాలూకు ముద్ర కావాలి అని పేర్కొన్నారు. "మనం పట్టభద్రులైన యువతీ యువకుల ను తయారు చేయడం ఒక్కటే కాకుండా, దేశం ముందంజ వేయడానికి అవసరమైన మానవ వనరుల ను మన విద్య వ్యవస్థ అందించేటట్లు గా చూడవలసి ఉంది. ఈ సంకల్పాన్ని మన గురువులు మరియు విద్య సంస్థ లు ముందుకు తీసుకు పోవాలి" అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. ఒక 'న్యూ ఇండియా' ను ఆవిష్కరించాలి అంటే గనక ఒక కొత్త వ్యవస్థ మరియు ఆధునిక ప్రక్రియ లు కీలకం అవుతాయి అని ప్రధాన మంత్రి అన్నారు. ఇదివరకు ఆలోచన కు అయినా అందనిది ప్రస్తుతం వాస్తవం గా నిలచింది అని ఆయన అన్నారు. "మనం కరోనా వంటి పెద్ద మహమ్మారి బారి నుంచి ఎంతో వేగం గా బయట పడడం ఒక్కటే కాకుండా, ఈ రోజు న ప్రపంచం లో అత్యంత వేగం గా వృద్ధి చెందుతున్నటువంటి పెద్ద ఆర్థిక వ్యవస్థ లో ఒకటి గా కూడా భారతదేశం ఉంది. ప్రస్తుతం మనం ప్రపంచం లో మూడో పెద్ద స్టార్ట్-అప్ ఇకోసిస్టమ్ గా ఉన్నాం" అని ప్రధాన మంత్రి వివరించారు.

అంతరిక్ష రంగ సంబంధిత సాంకేతిక విజ్ఞానం వంటి రంగాల లో ప్రతి పని ని ఇదివరకు ప్రభుత్వం ఒక్కటే చేస్తూ రాగా ప్రస్తుతం ప్రైవేటు పాత్రధారుల ద్వారా యువత కు ఒక కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించడం జరుగుతున్నది అని ప్రధాన మంత్రి అన్నారు. మహిళల కు ఇంతవరకు అనుమతి లేనటువంటి రంగాలు ప్రస్తుతం వారి యొక్క ప్రతిభ ను చాటి చెప్తున్నాయి అని ఆయన అన్నారు.

కొత్త విధానం లో, బాలల ను వారి ప్రతిభా వ్యుత్పత్తులకు మరియు వారి ఎంపికల కు అనుగుణం గా ప్రవీణులు గా తీర్చిదిద్దడం పైనే యావత్తు దృష్టి ని కేంద్రీకరించడమైంది అని ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రకటించారు. "మన యువత నైపుణ్యవంతులుగా, ఆత్మవిశ్వాసం తో కూడుకొన్న వారుగా, ఆచరణీయత కలవారుగా, ఇంకా ఆలోచించి ఎత్తు వేసే వారు గా కూడా ఉండాలి అని ఆయన అన్నారు. మరి దీని కోసం విద్య విధానం తగ్గ రంగాన్ని సిద్ధం చేస్తున్నది" అని ఆయన అన్నారు. ఒక సరికొత్త ఆలోచన ప్రక్రియ ద్వారా భవిష్యత్తు కోసం కృషి చేయవలసిన అవసరం ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. ప్రస్తుతం బాలలు చాలా అధునాతనమైనటువంటి ప్రతిభ స్థాయి ని చాటుతున్నారు. మరి వారి కి అండ గా మనం నిలచి, వారి ప్రతిభ ను వినియోగించుకోవలసిన అవసరం ఉంది అని ఆయన అన్నారు.

'జాతీయ విద్య విధానం' (ఎన్ఇపి) రూపకల్పన లో జరిగిన కృషి ని ప్రధాన మంత్రి ప్రశంసించారు. ఏమైనా, విధానం రూపకల్పన అనంతరం జోరు ను తగ్గించ కూడదు అని ఆయన నొక్కిచెప్పారు. విధానాన్ని అమలు చేయాలి అనే అంశం పైన నిరంతరం చర్చ మరియు శ్రమ లు చోటు చేసుకొన్నాయి అని ఆయన అన్నారు. ఈ విధానం అమలు ను గురించి చర్చించడానికి ఏర్పాటైన కార్యక్రమాల లోను, చర్చ సభల లోను ప్రధాన మంత్రి స్వయం గా పాలుపంచుకొన్నారు. ఇది దేశ యువత దేశ వృద్ధి లో ఒక క్రియాశీల భాగస్వామి గా మారే స్థితి కి దారి తీసింది.

దేశం లో విద్య రంగ సంబంధిత మౌలిక సదుపాయాల కల్పన లో భారీ స్థాయి లో మార్పులు చేర్పులు చేయడం జరిగింది అని ప్రధాన మంత్రి వివరించారు. దేశం లో అనేక కొత్త కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఐఐటి లు మరియు ఐఐఎమ్ లు ప్రారంభం అవుతున్నాయి. 2014వ సంవత్సరం తరువాతి కాలం లో, వైద్య కళాశాల ల సంఖ్య లో 55 శాతం వృద్ధి నమోదైంది అని ఆయన తెలిపారు. విశ్వవిద్యాలయాల కోసం పెట్టిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష అనేది విశ్వవిద్యాలయాల ప్రవేశాల కు సౌలభ్యాన్ని మరియు సమానత్వాన్ని కొని తెస్తుంది అని ఆయన అన్నారు. "జాతీయ విద్య విధానం ప్రస్తుతం మాతృభాష లో విద్యార్జన కు బాట ను పరుస్తోంది. ఈ క్రమం లో, సంస్కృతం వంటి ప్రాచీన భారతీయ భాషల ను కూడా ముందుకు తీసుకు పోవడం జరుగుతోంది" అని ఆయన అన్నారు.

ప్రపంచ విద్య కు ఒక ప్రధాన కేంద్రం గా భారతదేశం రూపొందగలుగుతుందన్న విశ్వాసాన్ని ప్రధాన మంత్రి వెలిబుచ్చారు. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం భారతదేశం లో ఉన్నత విద్య ను తీర్చిదిద్దవలసిందంటూ మార్గదర్శకాల ను ఇవ్వడం జరిగింది అని ఆయన అన్నారు. సంస్థ ల అంతర్జాతీయ వ్యవహారాల కోసమని 180 విశ్వవిద్యాలయాల లో ప్రత్యేక కార్యాలయాల ను ఏర్పాటు చేయడమైంది అని ఆయన తెలిపారు. విద్య రంగం లో చోటు చేసుకొంటున్నటువంటి అంతర్జాతీయ ధోరణుల ను గురించి అవగాహన ను ఏర్పరచుకోవలసింది గా నిపుణుల కు ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆచరణాత్మక అనుభవం మరియు క్షేత్ర సంబంధిత కృషి ల యొక్క ప్రాధాన్యాన్ని గురించి ప్రధాన మంత్రి నొక్కిచెప్తూ, 'ప్రయోగశాల నుంచి క్షేత్రానికి' అనే వైఖరి ని అలవరచుకోవాలని కోరారు. విద్యవేత్తలు వారి యొక్క అనుభవాన్ని తగిన పరీక్షల గీటురాయిపైన గీచి చూసుకోవాలని ఆయన అన్నారు. రుజువుల పై ఆధారపడి ఉండే పరిశోధనల ను సాగించాలి అని ఆయన అన్నారు. భారతదేశాని కి జనాభా పరం గా ఉన్న అనుకూలత అనే అంశం పై పరిశోధన చేయాలని, ఈ అంశాన్ని అత్యుత్తమమైన స్థాయి లో ఉపయోగించుకొనేందుకు మార్గాల ను వెదకాలని, అలాగే ప్రపంచం లో వృద్ధులు ఎక్కువగా ఉన్నటువంటి సమాజాల కు పరిష్కార మార్గాల ను అన్వేషించాలని ప్రధాన మంత్రి కోరారు. ఇదే మాదిరి గా ఆటు పోటుల కు తట్టుకొని నిలబడేటటువంటి మౌలిక సదుపాయాల కల్పన అనేది పరిశోధన కు అర్హమైన మరొక రంగం అని కూడా ఆయన అన్నారు. మనకు ఇదివరకు అందుబాటులో లేనటువంటి ఎన్నో అవకాశాల ను అందుకొనేటందుకు ఒక సాధనాన్ని 'జాతీయ విద్య విధానం' ఇచ్చింది. దీనిని మనం సంపూర్ణం గా వాడుకోవలసిన అవసరం ఉంది" అని చెప్తూ, ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

అఖిల భారతీయ శిక్ష సమాగమ్

'శిక్ష సమాగమ్' ను జులై 7వ తేదీ మొదలుకొని 9వ తేదీ వరకు విద్య మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమం 'జాతీయ విద్య విధానం' (ఎన్ఇపి) 2020 ని ప్రభావవంతమైన విధం గా అమలు లోకి తీసుకు రావడం కోసం ఒక మార్గసూచీ ని సిద్ధం చేయడం కోసం ప్రముఖ విద్యవేత్త లు, విధాన రూపకర్త లు మరియు విద్య రంగ ప్రముఖుల కు చర్చోపచర్చలు జరిపి వారి అనుభవాల ను పరస్పరం వెల్లడి చేసుకొనేందుకు, సమాలోచనలు జరిపేందుకు ఒక వేదిక ను అందిస్తుంది. ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తం గా కేంద్రీయ, రాష్ట్ర స్థాయి, డీమ్డ్ మరియు ప్రైవేట్ విశ్వవిద్యాలయాల కు చెందిన మరియు జాతీయ ప్రాముఖ్యం కలిగినటువంటి సంస్థలైన ఐఐటి, ఐఐఎమ్, ఎన్ఐటి, ఐఐఎస్ఇఆర్ లకు చెందిన 300 కు పైచిలుకు విద్య సంబంధమైన సిబ్బంది కి, పాలన సంబంధమైనసిబ్బంది కి, సంస్థల లోని సిబ్బంది కి వారి సామర్థ్యానికి మెరుగులను దిద్దడం కోసం నిర్వహించడం జరుగుతున్నది. సంబంధిత వివిధ వర్గాల వారు వారి వారి సంస్థల లో ఎన్ఇపి అమలు తాలూకు పురోగతి ఎలా ఉన్నదీ తెలియజేయడం తో పాటు గమనించదగినటువంటి అమలు సంబంధిత వ్యూహాల ను, ఉత్తమమైన అభ్యాసాల ను మరియు సాఫల్య గాథల ను కూడా ఈ సందర్భం లో వెల్లడి చేయనున్నారు. మూడు రోజుల పాటు కొనసాగే 'శిక్ష సమాగమ్' లో, ఎన్ఇపి 2020 లో భాగం గా ఉన్నత విద్య కోసం గుర్తించినటువంటి తొమ్మిది ఇతివృత్తాల పై బృంద చర్చలు జరుగుతాయి. ఆ ఇతివృత్తాల లో బహుళ విధ విభాగాల విద్య మరియు సమగ్ర విద్య; నైపుణ్యాల అభివృద్ధి, ఇంకా ఉద్యోగార్హత; పరిశోధన, నూతన ఆవిష్కరణ మరియు నవ పారిశ్రామికత్వం; నాణ్యమైన విద్య బోధన కోసం ఉపాధ్యాయుల లో సామర్థ్య నిర్మాణం; క్వాలిటీ, ర్యాంకింగ్ ఎండ్ అక్రిడిటేశన్; డిజిటల్ ఎంపవర్ మెంట్ ఎండ్ ఆన్ లైన్ ఎడ్యుకేశన్; సమానమైన అవకాశాల తో కూడినటువంటి మరియు అన్ని వర్గాల ను కలుపుకొని పోయేటటువంటి విద్య; ఇండియన్ నాలిజ్ సిస్టమ్, ఇంకా ఉన్నత విద్య యొక్క అంతర్జాతీయీకరణ ఉన్నాయి.

తుంగభద్రకు పోటెత్తిన వరద

కర్నూలు, జులై 8: తుంగభద్ర జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం ఉదయం తుంగభద్ర నదికి ఇన్ ఫ్లో 82103 క్యూసెక్కుల వరద నీరు చేరుతుండగా, జలాశయం నుంచి వివిధ కాలువలకు 221 క్యూసెక్కుల నీరు బయటకు వెళుతుంది. మొత్తంగా తుంగభద్ర జలాశయ నీటిమట్టం 1633 అడుగుల గాను, ప్రస్తుతం 1621.19 అడుగులుగా ఉంది. జలాశయం నీటి నిల్వలు 105.788 టీఎంసీలకు కాను.. 64.728 టీఎంసీల నీటి నిలువలు ఉన్నాయి. ఇదే సమయంలో గత ఏడాది తుంగభద్ర జలాశయానికి 4021 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో గా ఉండగా, 1610 అడుగులుగా నీటి నిల్వలు ఉండటం గమనార్హం.

శ్రీవారి దర్శనానికి 22గంటల సమయం-తిరుమలలో భక్తుల రద్దీ

తిరుమల,జులై 8:శ్రీవారి దర్శనానికి 22గంటల సమయం పడుతోంది. తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండి శంఖుమిట్ట క్యూలైన్ వరకు భక్తులు వేచి ఉన్నారు. నిన్న శ్రీవారిని 75,407 మంది భక్తులు వెంకన్న స్వామిని దర్శించుకోగా 35,535 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.56 కోట్లు వచ్చిందని టీటీడీ అధికారులు తెలిపారు.మరోవైపు సెప్టెంబర్ నెలకుగాను ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లను ఉదయం 11 గంటలకు అధికారులు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

వైఎస్ ఆశయం సిద్ధించిన రోజే ఆయనకు నిజమైన నివాళి - రేవంత్ రెడ్డి

అమరావతి, జులై 8: ప్రాంతాలకు అతీతంగా పేదవాడి గుండెల్లో సంక్షేమ సంతకం వైఎస్ ఆర్ అని అభివర్ణించారు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి. నేడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి. ఈ మేరకు హైదరాబాదులో వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అంతకుముందు గాంధీ భవన్ లో వైఎస్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రేవంత్ తో పాటు భట్టి విక్రమార్క, కేవీపీ రామచంద్రరావు, అంజన్ కుమార్ యాదవ్, షబ్బీర్ అలీ, విజయారెడ్డి తదితర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. అనంతరం రేవంత్ ట్విట్టర్ లో తన మనోభావాలను పంచుకున్నారు. చివరి శ్వాస వరకు కాంగ్రెస్ ఉన్నతి కోసం తప్పించిన నేత ఆయన అని కీర్తించారు. రాహుల్ గాంధీని ఈ దేశ ప్రధానిగా చూడాలన్నది వైఎస్ ఆశయం అని రేవంత్ రెడ్డి వెల్లడించారు. వైఎస్ ఆశయ సాధన కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, ఆయన అభిమానులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్ ఆశయం సిద్ధించిన రోజే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి మార్గదర్శకాల విడుదల

న్యూఢిల్లీ, జులై 7: పిల్లల సంక్షేమం మరియు పునరావాసం కోసం గతంలో బాలల రక్షణ సేవల పథకంగా అమలు జరిగిన పథకాన్ని మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ 2009-10 నుంచి కేంద్ర ప్రాయోజిత పథకంగా "మిషన్ వాత్సల్య" పథకాన్ని అమలు చేస్తోంది. భారతదేశంలోని ప్రతి బిడ్డకు ఆరోగ్యకరమైన మరియు సంతోషకరమైన బాల్యాన్ని అందించడం లక్ష్యంగా మిషన్ వాత్సల్య అమలు జరుగుతోంది. పిల్లల పూర్తి సామర్థ్యాన్ని గుర్తించి అన్ని రంగాల్లో అన్ని విధాలుగా వారు అభివృద్ధి సాధించేందుకు పథకం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుంది. పిల్లలు సుస్థిర అభివృద్ధి సాధించేందుకు అవసరమైన పరిస్థితులు కల్పించడం, జువెనైల్ జస్టిస్ యాక్ట్ 2015 నిబంధనలు పూర్తిగా అమలు జరిగేలా చూసి, ఎస్డీజీ లక్ష్యాలను సాధించడంలో రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు మిషన్ సహకారం అందిస్తుంది. పిల్లల్లో మార్పు తెచ్చేందుకు క్లిష్ట పరిస్థితుల్లో సంస్థలతో సంబంధం లేకుండా కుటుంబ ఆధారిత సంస్థీకరణ సూత్రం ఆధారంగా మిషన్ వాత్సల్య చివరి ప్రయత్నంగా సంరక్షణను ప్రోత్సహిస్తుంది.

చట్టబద్ధమైన సంస్థల పనితీరును మెరుగు పరచడం, లోపాలు లేకుండా సేవలను అందించే వ్యవస్థను బలోపేతం చేయడం, ఉన్నత స్థాయి సంస్థాగత సంరక్షణ/సేవలు, సంస్థలతో సంబంధం లేకుండా సమాజ భాగస్వామ్యంతో సంరక్షణ చర్యలను ప్రోత్సహించడం, అత్యవసర ఔట్రీచ్ సేవలు, శిక్షణ మరియు సామర్థ్యం పెంపుదల అంశాలతో "మిషన్ వాత్సల్య" అమలవుతోంది.

పథకం అమలు కోసం మంత్రిత్వ శాఖతో అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు మెమోరాండం ఆఫ్ అండర్‌టేకింగ్ పై సంతకం చేశాయి. కేంద్ర ప్రాయోజిత పథకంగా కేంద్రం మరియు రాష్ట్ర/కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాల మధ్య నిర్దేశిత వ్యయ భాగస్వామ్య నిష్పత్తి ప్రకారం మిషన్ వాత్సల్య అమలు చేయబడుతుంది.

మిషన్ వాత్సల్య పథకం అమలుకు సంబంధించి మంత్రిత్వ శాఖ వివరణాత్మక మార్గదర్శకాలను జారీ చేసింది. మిషన్ వాత్సల్య పథకం మార్గదర్శకాల ఆర్థిక నిబంధనల ఆధారంగా 2022-23 సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికలు మరియు ఆర్థిక ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలను కోరింది. 01 ఏప్రిల్, 2022 నుంచి మిషన్ వాత్సల్య పథకం నిబంధనలు వర్తిస్తాయి.

భద్రాచలంలో గిరిజన భవన్‌ను ప్రారంభించిన మంత్రులు సత్యవతి, పువ్వాడ

భద్రాద్రి కొత్తగూడెం : భద్రాచలంలో రూ. 1.10 కోట్లతో నూతనంగా నిర్మించిన గిరిజన భవన్‌ను గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు.

అనంతరం గిరిజన భవన్‌లో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఉమ్మడి ఖమ్మం జిల్లా పాలక మండలి సమీక్ష సమావేశంలో మంత్రులు పువ్వాడ, సత్యావతి పాల్గొన్నారు.

ఐటీడీఏ పీఓ భద్రాచలం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఖమ్మం, మహబుబాబాద్ ఎంపీ లు నామా నాగేశ్వర రావు, మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తాతా మధు, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు వీపీ గౌతం, అనుదీప్ , ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య , పోదెం వీరయ్య , వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వర రావు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కొత్తగూడెం, మహబుబాబాద్ జిల్లాల జడ్పీ చైర్మన్లు కోరం కనకయ్య, బిందు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా రైతు దినోత్సవ వేడుకలు

అమరావతి, జులై 8: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తోంది.. జిల్లా, రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకేలు) స్థాయిల్లో వేడుకలు నిర్వహిస్తోంది. వీటిలో పెద్ద ఎత్తున రైతులను భాగస్వాములను చేసేలా కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. ఇందులో భాగంగా గత మూడేళ్లుగా పెద్ద ఎత్తున అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

శాఖల వారీగా ఫొటో ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేస్తోంది. శాస్త్రవేత్తలు, నిపుణులు, ఆదర్శ రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తోంది. తొలుత వైఎస్సార్‌కు ఘన నివాళులర్పించాక వేడుకలకు శ్రీకారం చుట్టనున్నారు. వైఎస్సార్ రైతు భరోసా ? పీఎం కిసాన్, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, వైఎస్సార్ యంత్ర సేవా పథకం వంటి వాటి ద్వారా లబ్ధి పొందిన రైతులను భాగస్వాములను చేస్తున్నారు.

వివిధ పథకాల ద్వారా రైతన్నలకు నేరుగా రూ.1,27,633.08 కోట్ల మేర లబ్ధి చేకూర్చిన విషయాన్ని రైతులకు వివరించనున్నారు. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, రూ.2 వేల కోట్లతో విపత్తు సహాయ నిధి, వ్యవసాయ సలహా మండళ్ల ఏర్పాటు, ఉచిత విద్యుత్, అమూల్ ద్వారా పాడి రైతులకు అదనంగా లబ్ధి, ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50కే విద్యుత్ తదితర పథకాలు, కార్యక్రమాల ద్వారా రైతులకు ప్రభుత్వం లబ్ధి కలిగిస్తోంది. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.7 లక్షల ఆర్థిక సాయం, వైఎస్సార్ జలకళ ద్వారా సన్న, చిన్నకారు రైతులకు 2 లక్షల బోర్లు ఉచితంగా తవ్వించి, మోటార్లు కూడా ఉచితంగా ఇస్తున్నారు. వీటన్నింటిపై రైతు దినోత్సవ వేడుకల్లో అవగాహన కల్పించనున్నామని వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

డిసెంబర్‌లోపు రిజర్వాయర్లు పూర్తి చేయాలి

హైదరాబాద్, జులై 8:: ఓఆర్ఆర్ ఫేజ్ ? 2 తాగునీటి పనుల్లో వేగం పెంచాలని అధికారులను జలమండలి ఎండీ దాన కిశోర్ ఆదేశించారు. గురువారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఓఆర్ఆర్ ? 2 పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. డిసెంబరులోపు రిజర్వాయర్ల నిర్మాణాలు పూర్తి కావాలని ఎండీ దానకిశోర్ అధికారులను ఆదేశించారు. వీటితో పాటు ఇన్ లెట్ , ఔట్‌లెట్ పనులు కూడా పూర్తి చేయాలని, డిస్ట్రిబ్యూషన్ లైన్ పనులు కూడా సమాంతరంగా చేపట్టాలని సూచించారు.

పైప్‌లైన్ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో రక్షణ చర్యలు కచ్చితంగా పాటించాలని ఎండీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్ , సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే మురుగునీటిని శుద్ధికి ఎస్టీపీల నిర్మాణంలో భాగంగా ప్యాకేజ్ ? 1లో అంబర్‌పేట వద్ద 212.50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నూతనంగా నిర్మిస్తున్న సీవరేజి ట్రీట్ మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) పనులను జలమండలి ఎండీ దాన కిశోర్ గురువారం పరిశీలించారు.

సోమేశ్‌కుమార్‌ను కలిసిన ఇస్క్రీ డైరెక్టర్

హైదరాబాద్, జులై 8: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రదాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌ను గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ కళాశాల(ఇస్క్రీ) డైరెక్టర్ రామేశ్వర్ రావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంజినీరింగ్ కళాశాలలో నిరంతరం కొనసాగుతున్న వృత్తిపరమైన శిక్షణ కార్యక్రమాలు, జల్ జీవన్ మిషన్ కోసం కీలక వనరుల కేంద్రం, థర్డ్ పార్టీ నాణ్యత నియంత్రణ, డీపీఆర్ తయారీ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల వివరాలు చర్చించారు. సెప్టెంబర్ 22 నుంచి 24 వరకు ఇంజినీరింగ్ కళాశాలలో ఎక్స్ ఫో ఇన్ ?క్లైమేట్ చేంజ్ ఇంపాక్ట్ ఇన్ ఎకోసిస్టిమ్ అంతర్జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరవ్వాలని అహ్వానించడం జరిగిందని రామేశ్వర్ రావు ఈ సందర్భంగా ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వొద్దనే విజయమ్మ రాజీనామా-సజ్జల

అమరావతి, జులై 8: ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వొద్దనే వైఎస్ఆర్సీపీ గౌరవాధ్యక్షురాలి పదవికి విజయమ్మ రాజీనామా చేశారని ఏపీ ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. షర్మిలకు అండగా ఉండేందుకే రాజీనామా చేస్తున్నట్లు వైసీపీ ప్లీనరీ వేదికగా వైఎస్ విజయమ్మ ప్రకటించారు. అయితే ఆమె రాజీనామాపై సజ్జల స్పందించారు. ఆమెపై ఉన్న గౌరవం ఏమాత్రం తగ్గదన్నారు. రాజీనామాపై విజయమ్మ స్పష్టత ఇచ్చారన్నారు.

కోట్లాది మంది అభిమానులకు, ప్రజలకు సెల్యూట్ చేస్తున్నా

అమరావతి, జులై 8: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని శుక్ర, శనివారాల్లో వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న ప్లీనరీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. ఈ మేరకు సీఎం జగన్ మాట్లాడుతూ.. 2009, సెప్టెంబర్ 25న పావురాలగుట్టలో సంఘర్షణ మొదలైంది. ఓదార్పు యాత్రతో పార్టీ ఒక రూపం దాల్చింది. వైఎస్సార్ ఆశయాల సాధన కోసం పార్టీ ఆవిర్భవించింది.

నన్ను ప్రేమించి, నాతో వెన్నుదన్నుగా నిలబడ్డ కోట్లాది మంది అభిమానులకు, ప్రజలకు సెల్యూట్ చేస్తున్నా. ఈ 13ఏళ్ల ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాం. నాన్న నాకు ఇచ్చిన ఈ జగమంత కుటుంబం నా చేయి ఎప్పుడూ వదల్లేదు. ప్రజలు మూడేళ్ల కిందట కనీవినీ ఎరుగని మెజారిటీ ఇచ్చారు. ఏకంగా 151 స్థానాల్లో విజయం సాధించిన మనకు ప్రజలు అధికారం కట్టబెట్టారు. ప్రతిపక్షాన్ని 23 ఎమ్మెల్యే సీట్లకు, 3 ఎంపీ సీట్లకు దేవుడు పరిమితం చేశాడు.

టీడీపీ మేనిఫెస్టోని మాయం చేసింది

పదవి అంటే అధికారం కాదు.. ప్రజల మీద మమకారం అని నిరూపించాం. ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు ప్రతిక్షణం తపనపడ్డాం. అన్ని వర్గాల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. మేనిఫెస్టోలో హామీలు ఇచ్చి మాయం చేసే పార్టీలను చూశాం. ప్రజలు నిలదీస్తారేమోనని టీడీపీ మేనిఫెస్టోని మాయం చేసింది. ఆ పరిస్థితి నుంచి మేనిఫెస్టో అంటే అమలు చేసే ప్రతిజ్ఞగా చూపించాం. మన మేనిఫెస్టోను ప్రజల ముందు పెట్టి 95 శాతం హామీలు అమలు చేశాం. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను చూడటానికే టీడీపీ భయపడే పరిస్థితి వచ్చింది.

గుండె చెదరలేదు.. సంకల్పం మారలేదు

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే పార్టీ వైఎస్సార్‌సీపీ అని గర్వంగా చెప్తున్నాం. ఈ మూడేళ్ల ప్రయాణం ఎన్నో పోరాటాల ప్రస్థానం. రైతులపై మమకారం అంటే ఇలా ఉంటుందని నిరూపించింది మన పాలన. మనపై ఎన్ని రాళ్లు పడ్డా, మనపై ఎన్ని నిందలు వేసినా ఎదుర్కొన్నాం. ఎన్నికుట్రలు చేసినా, ఎన్ని దాడులు జరిగినా గుండె చెదరలేదు.. సంకల్పం మారలేదు. నాకు ఇచ్చిన ఈ కుటుంబం ఏనాడు నా చేయి వీడలేదు. మన పాలనలో దోచుకోవడం, పంచుకోవడం ఆగిపోయింది. కాబట్టి గజదొంగల ముఠాకు నిద్రపట్టడం లేదు అని సీఎం జగన్ అన్నారు.

దోచుకో పంచుకో అన్నట్లుగా వ్యవహరించిన గజదొంగల ముఠా

దుష్టచతుష్టయం మన పాలనలో మంచి ని ఓర్వలేక అబద్ధాల విషప్రచారం చేస్తున్నారు. 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు ఇవాళ నోరు పారేసుకుంటున్నారు. ఆ కట్టుకథల్ని, వాటికి అబద్ధాలు జోడించి ఎల్లోమీడియా ప్రచారం చేస్తోంది. గతంలో రాష్ట్రాన్ని దోచుకో పంచుకో అన్నట్లుగా గజదొంగల ముఠా వ్యవహరించింది. ఇప్పుడు అవకాశం లేక కడుపుమంటతో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ జనం వెంట, జనం గుండెల్లో ఉంది. గజదొంగల ముఠా మాత్రం, ఎల్లో మీడియా, ఎల్లో సోషల్ మీడియాలో మాత్రమే ఉంది. వాళ్లకు, మనకు ఎక్కడా పోలిక లేదు. మనది చేతల పాలన.. వాళ్లది అబద్ధపు విష ప్రచారం అని సీఎం జగన్ అన్నారు.

జనం మధ్య నుంచే వైఎస్ ఆర్ సీపీ పుట్టింది - వైఎస్ విజయమ్మ

అమరావతి, జులై 8: షర్మిలమ్మ తెలంగాణ కోడలుగా.. వైఎస్సార్ కూతురుగా.. వైఎస్ఆర్ టీపీ పెట్టిందని వైఎస్ విజయమ్మ అన్నారు. తన వంతుగా తెలంగాణలో ఆమె ప్రయత్నం చేస్తుందన్నారు. ఎల్లో మీడియాలో ఏదిబడితే అది రాస్తున్నారు. ఎల్లో మీడియా అబద్ధాలు రాయడం దురదృష్టకరం. ఇద్దరి పిల్లలకు తల్లినే.. తెలుగువాడి గుండెచప్పుడు వైఎస్సార్. ఇప్పటి వరకు జరిగింది ఒక ఎత్తు.. ఇకపై జరగబోయేది ఒక ఎత్తు అని విజయమ్మ అన్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ ప్లీనరీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏపీ కంటే కూడా.. తెలంగాణలో ముందుగానే ఎన్నికలు వస్తాయి. ఏపీ భవిష్యత్తు ప్రయోజనాల కోసం సీఎం జగన్‌కు కచ్చితంగా స్టాండ్ ఉంటుంది. తెలంగాణలో షర్మిలకు వేర్వేరు విధానాలు ఉంటాయని" విజయమ్మ అన్నారు.

"వైఎస్ఆర్ ఆశయాలు పుణికిపుచ్చుకున్నవారు జగన్, షర్మిల. నేను రాయని, చేయని సంతకంతో.. రాజీనామా లేఖ విడుదల చేశారు. ఇవి జుగుప్సకర రాతలు. ఆ లేఖ చూసినప్పుడు చాలా బాధ వేసింది. నేను రాయని, నేను చేయని సంతకం ఉన్న లేఖను

ఎలా రిలీజ్ చేస్తారు?. తెలంగాణలో షర్మిలకు నా అవసరం ఉంది, అందుకే నేను అక్కడ షర్మిలకు అండగా ఉండాలని అనుకుంటున్నా. నా ఉనికి ఎవరికి వివాదస్పదం కాకుండా ఉండాలనే ఈ నిర్ణయం. ప్రజలకు నా ఇద్దరు బిడ్డలు అండగా ఉంటూరు. మీ మద్దతు వారికి కావాలి. తల్లిగా జగన్‌కు ఎప్పుడు నా మద్దతు ఉంటుంది" అని పేర్కొన్నారు.

"నన్ను క్షమించమని వైఎస్ఆర్ అభిమానులను కోరుతున్నాను. రాజకీయం అంటే దుష్ప్రచారాలు, వెన్నుపోట్లు కాదు. వైఎస్సార్ లేని లోటును నాకు ఎవరూ తీర్చలేరు' అని వైఎస్ విజయమ్మ అన్నారు. ఇలాంటి వాటికి తావివ్వకుండా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ నుంచి తప్పుకోవాలనుకుంటున్నా" అని విజయమ్మ అన్నారు.

వైఎస్సార్‌కు నివాళులర్పించిన సీఎం జగన్, కుటుంబ సభ్యులు

అమరావతి, జులై 8: మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 73వ జయంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సమాధి వద్ద కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇదిలా ఉంటే, మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు ?ఘనంగా నిర్వహిస్తున్నారు.

ట్రక్కును ఢీకొట్టిన బస్సు.. ఆరుగురు మృత్యువాత..

చెన్నై , జులై 8: తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చెంగల్‌పట్టు సమీపంలోని హైవే ఆర్టీసీకి చెందిన బస్సు ట్రక్కును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు సహా ఆరుగురు ప్రయాణికులు మృతి చెందారు. మరో పది మంది గాయపడ్డట్లు పోలీసులు పేర్కొన్నారు. చిదంబరం వెళ్తున్న బస్సు చెన్నై ? తిరుచిరావల్లి జాతీయ రహదారిపై మధురాంతకం వద్ద ట్రక్కును ఢీకొట్టింది. ప్రమాదంలో మరో పది మంది వరకు గాయపడ్డారని, వారిని ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదం మృతులకు ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. ఇదిలా ఉండగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మృతులకు సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు సీఎం సహాయ నిధి నుంచి ఒక్కొక్కరికి రూ.5లక్షల సహాయాన్ని ప్రకటించారు. చెంగల్‌పట్టు పోలీసుల కథనం ప్రకారం.. బస్సు తిరుచ్చి హైవేపై చెన్నై నుంచి చిదంబరం పట్టణానికి వెళ్తున్నది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ - "విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఒక ప్రేరణ"

న్యూఢిల్లీ, జులై 8: రహదారులు, రైల్వేలు, విమానయానం, గ్యాస్, పవర్ ట్రాన్స్‌మిషన్, రెన్యూవబుల్ ఎనర్జీ మొదలైన రంగాలలో వివిధ మంత్రిత్వ శాఖలు/ యుటిలిటీలు, మౌలిక సదుపాయాల ప్రణాళికలను ఏకీకృత దృక్పథంతో తీసుకురావాలనే లక్ష్యంతో 2021 అక్టోబర్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రధాన మంత్రి పీఎం గతిశక్తి-నేషనల్ మాస్టర్ ప్లాన్ (ఎన్ఎంపీ)ని ప్రారంభించారు. ఇటువంటి అపూర్వమైన చొరవ దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదం. ఇందులో సాధారణంగా 'పవర్' ప్రత్యేకించి 'ట్రాన్స్‌మిషన్' దేశ ఇంధన జీవన రేఖను బలోపేతం చేస్తుంది.

"ఆత్మనిర్భర్ భారత్" లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా గుజరాత్‌లోని బిసాగ్-ఎన్ అభివృద్ధి చేసిన స్వదేశీ ఇస్రో చిత్రాలతో ప్రాదేశిక ప్రణాళిక సాధనాలతో సహా సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించుకోవడం ద్వారా వివిధ ఆర్థిక మండలాలకు మౌలిక సదుపాయాల యొక్క బహుళ-మోడల్ కనెక్టివిటీని అందించే గేమ్ ఛేంజర్.

దేశం మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో మౌలిక సదుపాయాలు మరియు ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో పవర్ కీలక పాత్ర పోషిస్తుంది. పీఎం గతిశక్తి ఎన్ఎంపీ పోర్టల్ పవర్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్ట్‌లలో సమయం మరియు అమలు ఖర్చును తగ్గించడం ద్వారా ప్రణాళిక, అమలు ప్రక్రియను సులభతరం చేయడానికి "వన్ క్లిక్ సమగ్ర వీక్షణ"ను అందిస్తుంది. ఇది సింగిల్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ అలాగే బహుళ-సామర్థ్యాల ద్వారా లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది.

పవర్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుల అభివృద్ధిలో పీఎం గతిశక్తి ఎన్ఎంపీ పోర్టల్ ప్రణాళిక, టెండరింగ్, అమలు మరియు ఆమోద దశలలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రణాళిక దశలో వినియోగదారు ట్రాన్స్‌మిషన్ లైన్ తాత్కాలిక లైన్ పొడవు మరియు సబ్‌స్టేషన్(ల) స్థానాన్ని గుర్తించాలి. టెండరింగ్/బిడ్డింగ్ దశలో సర్వే ఏజెన్సీ అత్యుత్తమ సాంకేతిక-ఆర్థిక మార్గాన్ని గుర్తించడానికి పోర్టల్‌ను ఉపయోగించుకుంటుంది. అమలు దశలో వాస్తవ పరిస్థితుల ఆధారంగా, ట్రాన్స్మిషన్ లైన్ మార్గం మరియు సబ్‌స్టేషన్ స్థానాన్ని ఖరారు చేయాలి. చివరగా, సింగిల్ విండో క్లియరెన్స్ కోసం ఆమోదం దశ ఊహించబడింది.

"ఒకే సూర్యుడు, ఒకే ప్రపంచం, ఒకే గ్రిడ్" కోసం పీఎం ఇచ్చిన పిలుపు బలమైన మరియు నమ్మదగిన ప్రసార వ్యవస్థ కోసం టోన్ సెట్ చేసింది, ఇది భారతదేశ పునరుత్పాదక శక్తి (ఆర్ఈ) ఆశయాలకు ప్రపంచవ్యాప్తంగా పునరుత్పాదక వృద్ధికి తోడ్పడుతుంది. ఆర్ఈ కథనంలో పవర్ ట్రాన్స్‌మిషన్ ఒక ఎనేబుల్‌గా ఉంది మరియు వివిధ కీలకమైన పవర్ ప్రాజెక్ట్‌లు దేశవ్యాప్తంగా ఆర్ఈ తరలింపును ప్రారంభిస్తున్నాయి. ఈ ప్రాజెక్టులలో, విద్యుత్ మంత్రిత్వ శాఖ 6 ఆర్ఈ రిచ్ స్టేట్స్ రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడుల్లో 9 హై ఇంపాక్ట్ పవర్ ప్రాజెక్ట్‌లను (10 నంబర్ ట్రాన్స్‌మిషన్ లైన్‌లు) చేపట్టింది. ప్రాథమిక డేటా (లైన్ రూట్, టవర్ లొకేషన్, సబ్‌స్టేషన్ లొకేషన్, ఓనర్ పేరు మొదలైనవి) కలుపుకొని ఐఎస్‌టీఎస్ ట్రాన్స్‌మిషన్ లైన్‌ల ప్రత్యేక లేయర్‌ని సృష్టించడం ద్వారా ప్రాజెక్ట్‌ల యొక్క అవసరమైన వివరాలు పోర్టల్‌లో మ్యాప్ చేయబడ్డాయి.

పీఎం గతిశక్తి లక్ష్యానికి అనుగుణంగా దేశ పొడవు మరియు వెడల్పులో విస్తరించి ఉన్న పోర్టల్‌లో మొత్తం 'ప్రస్తుతం ఉన్న' ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ (ఐఎస్‌టీఎస్) లైన్‌లు మ్యాప్ చేయబడ్డాయి. అలాగే, 90% 'నిర్మాణంలో ఉన్న' ఐఎస్‌టీఎస్ లైన్‌లు కూడా పోర్టల్‌లో ఏకీకృతం చేయబడ్డాయి. మిగిలిన 10% ఐఎస్‌టీఎస్ లైన్‌లు సంబంధిత ట్రాన్స్‌మిషన్ సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా రూట్ సర్వేను ఖరారు చేసిన తర్వాత ఏకీకృతం చేయబడతాయి.

పీఎం గతిశక్తి ఎన్ఎంపీ పోర్టల్ అంతిమంగా ఆర్థిక మండలాలకు అవాంతరాలు లేని అనుసంధానం కోసం మౌలిక సదుపాయాల ప్రణాళిక పట్ల సురక్షితమైన, స్థిరమైన, కొలవదగిన మరియు సహకార విధానాన్ని నిర్మించడం ద్వారా దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన సమన్వయను పరిష్కరించడంలో సహాయపడుతుంది. పీఎం గతిశక్తి ఎన్ఎంపీ పోర్టల్ పోర్టల్ మంత్రిత్వ శాఖలు, యుటిలిటీస్ మరియు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం మరింత సమగ్రమైన మరియు సమగ్రమైన విధానాన్ని ప్రారంభించడంతో, నమ్మకమైన 'అందరికీ శక్తి'ని అందిస్తూ చేస్తూ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందడానికి ఒక దేశంగా సిద్ధంగా ఉంటాము.

విద్యార్థులకు ఉచిత షూలు, సాక్స్‌ల కోసం భిక్షాటన చేస్తా : డీకే శివకుమార్

బెంగళూరు, జులై 8: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత షూలు, సాక్స్‌ల పంపిణీ వ్యవహారంపై కాంగ్రెస్, కాషాయ పార్టీ మధ్య డైలాగ్ వార్ ముదిరింది. ఈ పథకానికి ప్రభుత్వం వద్ద నిధులు లేకుంటే వారి కోసం తాను భిక్షాటన చేసి విద్యార్థులందరికీ ఉచిత షూలు, సాక్స్ అందిస్తానని కర్నాటక కాంగ్రెస్ చీఫ్ డీకే శివకుమార్ అన్నారు. విద్యార్థులను ఆదుకునేందుకు ఎన్నో సంస్థలున్నాయని, కాంగ్రెస్‌లోనూ తాము రెండు శాతం నిధులను కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద సేకరిస్తామని వీటిని సమీకరించి చిన్నారుల కోసం వెచ్చిస్తామని అన్నారు. పిల్లలు విద్యాబుద్ధుల కోసం పాఠశాలలకు వెళతారని, షూలు, సాక్స్‌ల కోసం కాదని కర్నాటక విద్యాశాఖ మంత్రి బీసీ నాగేష్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో డీకే శివకుమార్ స్పందించారు. మరోవైపు విద్యా మంత్రి వ్యాఖ్యలపై పెను దుమారం రేగింది. మంత్రి వ్యాఖ్యలు అమానవీయంగా ఉన్నాయని సిద్ధరామయ్య వరుస ట్వీట్లలో ఆక్షేపించారు. చెప్పులు లేకుండా స్కూలుకు వచ్చే పిల్లలు పడే కష్టం గురించి తెలిస్తే ఆయన అలా మాట్లాడరని అభ్యంతరం వ్యక్తం చేశారు. దళితులు, బీసీలు, అన్ని కులాల్లో పేద విద్యార్థులకు అవసరమైన పథకాలను తాము అమలు చేశామని, విద్యార్థులు ఆత్మగౌరవంతో చదువుకునేలా చేశామని చెప్పుకొచ్చారు. పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిన మీకు ఇవి ఎలా తెలుస్తాయని మంత్రిని ఉద్దేశించి సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు.

ఉత్తరప్రదేశ్‌లో జాతీయ రహదారి ప్రాజెక్టులు

న్యూఢిల్లీ, జులై 8: కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లోని బుద్ధ భగవానుడి పరినిర్వాణ స్థలం ఖుషీనగర్ వద్ద రూ.42.67 కోట్ల వ్యయంతో 2.5 కి.మీ. పొడవుతో రెండు ఫ్లైఓవర్ బ్రిడ్జీల నిర్మాణ పనులను మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ ఫ్లై ఓవర్లను 18 నెలల్లో పూర్తి చేస్తామని ఆయన తన వరుస ట్వీట్లలో పేర్కొన్నారు. వీటి నిర్మాణంతో దేశ, విదేశీ పర్యాటకుల రాక సులభతరం అవుతుందని, స్థానిక ప్రజల ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. రూ.2,414.67 కోట్ల మేర బడ్జెట్‌తో ఉత్తరప్రదేశ్ మరియు హర్యానాలో భారతమాల ప్రాజెక్టు కింద గౌతమ్ బుద్ నగర్ జిల్లాలో డీఎన్‌డీ ఫరీదాబాద్ - బల్లాభాగ్ బైపాస్ కేఎంపీ లింక్ నుండి జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయానికి (ఢిల్లీ ముంబై ఎక్స్‌ప్రెస్‌వేని కలుపుతూ) గ్రీన్‌ఫీల్డ్ కనెక్టివిటీ నిర్మాణాన్ని చేపట్టినట్టుగా శ్రీ గడ్కరీ వివరించారు. మొత్తం 31.425 కి.మీ .పొడవుతో ఈ రహదారిని తాము హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో నిర్మిస్తామని తెలిపారు. నిర్మాణ కాలం 2 సంవత్సరాలు ఉంటుంది మరియు ఇది ఆగ్రా, మథుర మరియు పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్‌లను కూడా కలుపుతుందని ఆయన వివరించారు.

కేంద్ర ఉక్కుమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జ్యోతిరాదిత్య సింధియా

న్యూఢిల్లీ, జులై 8: పౌర విమానయాన శాఖకు అదనంగా కేంద్ర మంత్రిగా శ్రీ జ్యోతిరాదిత్య సింధియా గురువారం నాడు ఉద్యోగ భవన్ లో బాధ్యతలు స్వీకరించారు. మంత్రిత్వ శాఖ కార్యాలయంలో మంత్రికి ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ సింగ్ ఆహ్వానం పలికారు.

కొత్తగా అప్పగించిన ఉక్కుమంత్రిత్వ శాఖ బాధ్యతలను స్వీకరించిన తర్వాత దేశం, ప్రధానమంత్రి చూపిన విశ్వాసాన్ని, అంచనాలను నెరవేరుస్తానంటూ శ్రీ జ్యోతిరాదిత్య సింధియా తన నిబద్ధతను ప్రకటించారు.

దేశ నిర్మాణంలో ఉక్కురంగం కీలక పాత్ర పోషిస్తుందన్న విషయం తెలిసిందేనని మంత్రి అన్నారు. ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతలో బలమైన వృద్ధి యంత్రంగా మారేందుకు ఈ రంగాన్ని అత్యధిక సంభావ్యత దిశగా తీసుకువెళ్ళడమే లక్ష్యమని చెప్పారు.

పార్లమెంటులో రాజ్యసభ సభ్యునిగా మధ్యప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ సింధియా, పౌరవిమానయాన శాఖ, ఉక్కు మంత్రిత్వ శాఖలకు కేబినెట్ మంత్రిగా ఉన్నారు. ఆయన నాలుగు సార్లు లోక్ సభ్య సభ్యునిగా (2002-04, 2004-09, 2009-14, 2014- 19) సహా ఐదు పర్యాయాలు పార్లమెంటు సభ్యునిగా ఉన్నారు. తన ప్రజా సేవ ప్రయాణాన్ని శ్రీ సింధియా 2002లో ప్రారంభించారు. ఆయన 2008లో టెలికమ్యూనికేషన్స్, పోస్ట్స్ ఉ ఐటి సహాయమంత్రిగాను, 2009లో వాణిజ్య ఉ పరిశ్రమల శాఖ మంత్రిగాను, తర్వాత 2012లో విద్యుత్తు (ఇండిపెండెంట్ చార్జ్) మంత్రిగా సేవలందించారు.

శ్రీ సింధియా అమెరికాలోని హార్వార్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఎకనమిక్స్ లో బ్యాచిలర్స్ డిగ్రీని, స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలోని గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుంచి ఎంబిఎ డిగ్రీని పొందారు.

విదేశీ సేకరణ కార్యక్రమాలకు ఆర్థిక సేవలను అందించేలా మూడు ప్రైయివేట్ రంగ బ్యాంకులను అనుమతి

న్యూఢిల్లీ, జులై 8: ప్రభుత్వ వ్యాపార కేటాయింపులలో ఫైనాన్షియల్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ ద్వారా ప్రైయివేట్ సెక్టార్ బ్యాంక్‌లకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఇందులో భాగంగా మూడు ప్రైవేట్ రంగ బ్యాంకులకు విదేశీ సేకరణ కార్యక్రమాలలో సేవలను అందించడానికి అవకాశం కల్పించింది. ఎంఓడీ క్రెడిట్ లెటర్ మరియు డైరెక్ట్ బ్యాంక్ ట్రాన్స్‌ఫర్ వ్యాపారాన్ని అందించడానికి గాను హెచ్‌డీఎఫసీ బ్యాంక్ లిమిటెడ్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌లకు అవకాశం కల్పించేలా ఆమోదం తెలిపింది. ఈ అంశానికి

సంబంధించి ఎంఓడీ తరఫున న్యూఢిల్లీకి చెందిన పీసీడీఏ సంస్థ 3 బ్యాంకులతో ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. ఇప్పటి వరకు, ఎంఓడీకిఈ తరహా సేవలను అందించడానికి అధీకృత ప్రభుత్వ రంగ బ్యాంకులు మాత్రమే వినియోగించబడేవి. తాజా పరిణామంతో మొదటిసారిగా మూడు ప్రైవేట్ బ్యాంకులు కూడా ఎంఓడీ ద్వారా విదేశీ సేకరణ కోసం ఆర్థిక సేవలను అందించ

ఆషాఢమాసం విశేషాలు

భారతీయ జీవన విధానం లో తిథులు నక్షత్రాలు మాసాల గురించి కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. ఇవి ఏనాడో వేల ఏళ్ల క్రితం మన పూర్వీకులు అభివర్ణించారు.

పూర్వాషాడ నక్షత్రంలో కూడిన పౌర్ణమి ఉన్న నెలను ఆషాఢ మాసంగా చెప్పారు. ఈ మాసాన్ని శూన్య మాసం అని పిలుస్తారు. అంతేకాదు వర్షఋతువు ఈ మాసం లో ప్రారంభమయ్యి, నదీ నాదాలు నీటితో నిండుగా ఉంటాయి . ఈ కాలాన్నే ఈగ కాలం అనీ అంటారు ఎందుకంటే ఈగలు ఎక్కువ కనిపిస్తాయి. అందుకే చాలా పరిశుభ్రంగా ఉంచాలి ఇంటినీ, పరిసరాలనూ. ఈ మాసం లో చేసే స్నానం, దానం, జపం , పారాయణలు, విశేష ఫలితాన్నిస్తాయి. ఆషాడం లో చేసే సముద్ర నదీస్నానాలు చేయాలి ఇలా చేయడం ముక్తి దాయకం అంటారు. మన హిందూ సాంప్రదాయం ప్రకారం ఆషాఢమాసం లో పాదరక్షలు, గొడుగు, ఉప్పు దానం చేయడం మంచి ఫలితాలనిస్తుంది.

దక్షిణాయనం ఆషాఢ మాసం లోనే ప్రారంభమవుతుంది. కర్కాటకం లోనికి సూర్యుడు ప్రవేశించడం తోనే దక్షిణాయనం ఆరంభమవుతుంది. అంటే సూర్యుడు ఈ రాశిలో ప్రవేశించినప్పటి నుండి తిరిగి మకర రాశిలో ప్రవేశించే వరకు దక్షిణాయనం అంటారు. ఈ ఆయనం లో సూర్యుడు భూమధ్య రేఖకు దక్షిణం గా సంచరిస్తాడు. దక్షిణాయనం పితృదేవతలకు ప్రీతికరమని కూడా అంటారు.

గురువు ను గౌరవించే సంప్రదాయం మనది. ఆషాఢ మాసం లోనే త్రిమూర్తి స్వరూపుడైన గురువుని ఆరాధించే పర్వదినం గురు పూర్ణిమ కూడా. దీనినే వ్యాస పూర్ణిమ అని కూడా అంటారు. ఆషాఢ శుద్ధ విదియ నాడు పూరీ జగన్నాథ, బలభద్ర, సుభద్ర రథయాత్ర కన్నుల పండుగ గా జరపడం అనాదిగా వస్తోంది.

పంచమికీ ప్రాధాన్యత ఉంది. ఆషాఢ శుద్ధ పంచమి స్కంధ పంచమి గా చెప్పారు. సుబ్రమణ్యా స్వామిని ఈ రోజు అత్యంత భక్తి శ్రద్దలతో పూజిస్తారు. ఆషాఢ షష్టి ని కుమార షష్టి గా జరుపడమూ చూస్తాం. ఇలా ఆషాఢ మాసంలో తిథులు ప్రత్యేకంగా ఉంటాయి.

ఆషాడ సప్తమిని భానుసప్తమి గా చెప్పబడింది. ఉత్తరం నుంచి దక్షిణ దిశకు పయనిస్తున్న సూర్యుడు మూడు నెలలు తర్వాత మధ్యకు చేరుకుంటాడు. ఆ రోజున పగలు, రాత్రి, నిమిషం ఘుడియ విఘుడియల తేడా లేకుండా సరిమానానం గా ఉండడం విశేషం.

ఈ మాసంలో ఏకాదశి ని తొలి ఏకాదశి అని శయన ఏకాదశి అని అంటారు. ఈరోజు నుండి చాతుర్మాస వ్రతం ఆరంభమవుతుంది. దీనినే మతత్రయ ఏకాదశి అని పిలుస్తారు.

తెలంగాణా ప్రాంతం లో ఆషాఢ మాసంలో నే సంప్రదాయబద్దమైన బోనాల ఉత్సవాలను భక్తి శ్రద్దలతో జరుపుకొంటారు. మహంకాళి అమ్మవారి కోసం తయారు చేసే భోజనాన్ని 'బోనం 'అంటారు. బోనం అంటే భోజనం అని అర్థం. బోనం అమ్మవారికి నివేదన చేసే పర్వదినోత్సవాలే బోనాల పండుగ.

గ్రామీణ ప్రాంతం లో ఈ పండుగ అత్యంత శ్రద్ద తో జరుపుకుంటారు. పట్టణాల్లో నూ వైభవం గా జరుపుకొంటారు. సమస్త జగత్తుకు కారణమైనటువంటి అమ్మవారిని భక్తి శ్రద్దలతో పూజిస్తారు. అన్నం, బెల్లం, పెరుగు, పసుపు నీళ్ళు, వేపాకులు ఈ బోనం లో ఉంటాయి. ఇవన్నీ కూడా ఆరోగ్యానికి హానికలిగించే వ్యాదుల నుండి ఉపకరించేవి. ఈ సమయం లో ప్రకృతి లో జరిగే మార్పుల వలన అనారోగ్యాలపాలు కాకుండా ఇవి ఎంతో మేలు చేస్తాయని ప్రతి కుటుంబం నియమ నిష్టలతో జరుపుకుంటారు.

ఆషాఢ మాసం అనారోగ్య మాసం అని కూడా మనందరికీ తెలుసు. విపరీతమైన ఈదురుగాలుల తో పుల్లచినుకులు పడే సమయం ఈ ఆషాడమాసమే. కాలువలోను, నదులలోను, ప్రవహించే నీరు పరిశుభ్రంగా ఉండదు. చెరువుల లోనికి వచ్చి చేరిన నీరు మలినం గా ఉండి మనుషుల ఆరోగ్యాలకు హాని కలిగిస్తుంది.

మనది వ్యవసాయ ఆధారిత దేశం. పొలం పనులన్నీ ఈ మాసం లోనే మొదలు పెడతారు రైతులు. చైత్ర వైశాఖ మాసాలలో వ్యవసాయపు పనులు ఉండవు. కాబట్టే ఈ సమయం లోనే వివాహాది శుభముహూర్తాలు ఎక్కువగా ఉంటాయి , ఈ రోజుల్లో కొత్తగా పెళ్లి అయిన యువకులు ఆరు నెలల కాలం అత్తా గారి ఇంట్లో ఉండే సంప్రదాయం ఉండేది. కష్టపడి వ్యవసాయపు పనులు చేయవలసిన యువకులు అత్తవారింట్లో కూర్చొని ఉంటే, సకాలం లో జరగాల్సిన పనులు జరగవు. వర్షాలకు తగినట్లుగా విత్తనాలు చల్లుకొనే రోజులు అవి. ఇప్పటి లాగ కాలువల ద్వారా నీరు లభించేది కాదు. సరైన సమయం లో విత్తనాలు చల్లక పోతే సంవత్సరమంతా దారిద్ర్యం తో బాధ పడవలసిందే. అందుకే కొత్త కోడలు పుట్టింట్లోనే ఉండాలి . అల్లుడు అత్తవారింటికి వెళ్ళ కూడదు అనే నియమం విధించారు పెద్దలు. ఇంటి ద్యాస తో పనులు సరిగా చేయరని ఆషాఢ మాస నియమం పెట్టారు. అంతే కాకుండా, అనారోగ్య మాసం ఆషాడం. కొత్త నీరు త్రాగటం వల్ల చలి జ్వరాలు, విరోచనాలు, తల నొప్పి మొదలైన రోగాలు వచ్చే సమయం, స్త్రీలు గర్భం ధరించడానికి మంచి సమయం కాదు, అనారోగ్య దినాలలోను అశుభ సమయాల లోను, గర్భధారణ జరిగితే ఉత్తమ సంతానం కలగదనే నమ్మకం కూడా ఉంది. ఇన్ని కారణాల వల్ల ఆషాడమాసాన్ని కొన్ని పనులకు నిషిద్ధం చేసిన మన పెద్దలు ఎంతో ముందుచూపు ఉన్నవారు .

ఆషాడ మాసంలో గోరింటాకు విశిష్టత:

గోరింటకూ ఆషాఢ మాసానికి దగ్గర సంబంధం ఉన్నది . గోరింట చలువ చేస్తుంది , అందంగా ఉంటుంది.

అందుకే ఇప్పటివారంతా పెళ్లి కి ముందు రోజు మెహందీ అట్టహాసంగా జరుపుకుంటున్నారు.

ఇందులోనూ మహిమ ఉన్నదనే ! కారణం శ్రీ మహాలక్ష్మి ఆశీస్సులు

వధూవరులకేకాకుండా వివాహంలో పాల్గొనే బంధువులైన మహిళలకు లభిస్తుందని విశ్వాసం.

శుక్రవారం పూట గోరింటాకును మహాలక్ష్మీ దేవిని ధ్యానించి చేతులు పండేంతగా పెట్టుకుంటే..

మహిళలకు ఎలాంటి కష్టాలుండవని..

శ్రీ మహాలక్ష్మీ దేవి అనుగ్రహం లభిస్తుందని పండితులు చెప్తున్నారు. పెళ్లికాని కన్యలు ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకుంటే మంచి భర్త లభిస్తాడు అని శాస్త్రాలు చెబుతున్నాయి. గోరింటాకు గూర్చిన పాటలు విశేష ఆదరణ పొందినాయానాడు . ఈ ఆషాడ మాసంలో మహిళా మణులు గోరింటాకు పెట్టుకొని తమ కలలను సాకారం చేసుకుని ఆనందం గా ఉండాలనే ఉద్దేశం ఇందులో ఉంది . అందరికీ ఆషాఢ మాసంలో ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు చేకూరుతాయని , చేకూరాలని ఆశిస్తూ అభినందనలు తెలుపుతున్నాను.

-కావ్యసుధ
9247313488

1800 కోట్ల రూపాయల విలువగల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ

న్యూఢిల్లీ, జులై 8: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు వారణాశిలోని సిగ్రాలో గల డాక్టర్ సంపూర్ణానంద క్రీడా ప్రాంగణం వద్ద జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 1800 కోట్ల రూపాయల విలువగల వలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఉత్తరప్రదేశ్ గవర్నర్ శ్రీమతి ఆనందీ బెన్ పటేల్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి ఉత్తర ప్రదేశ్, కాశీ ప్రజలు ఇటీవలి ఎన్నికలలో తమకు భారీ మద్దతు నిచ్చినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

కాశీ ఎల్లప్పుడూ సజీవంగా ఉందని , నిరంతరం మార్పు కలిగి ఉంటుందని ప్రధాన మంత్రి అన్నారు. ఇప్పుడు కాశీ దేశం మొత్తం ఒక వారసత్వంతో పాటు అభివృద్ధి చిత్రాన్ని చూపించింది.

కాశీ ఎల్లప్పుడూ సజీవత్వంతో పాటు , నిరంతరం మార్పు కలిగి ఉంటుందని ప్రధాన మంత్రి అన్నారు. ఇప్పుడు కాశీ దేశం మొత్తం ఒక గొప్ప వారసత్వంతో పాటు అభివృద్ధి చిత్రాన్నీ చూపించిందని అన్నారు. వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయని, మరి కొన్ని పనులు జరుగుతున్నాయన్నారు. కాశీ ఆత్మ అంతర్గతమని, అయితే కాశీ రూపానికి నిరంతరం మెరుగులు దిద్దేందుకు కృషి జరుగుతుందని అన్నారు. కాశీలో అభివృద్ధి వల్ల కాశీలో సులభంగా తిరగడానికి వీలు కలగడంతోపాటు, ప్రగతికి దోహదపడు తోందని అన్నారు. "నా కాశీ సబ్ కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్‌కు గొప్ప ఉదాహరణ" అని ఆయన అన్నారు.

కాశీ పార్లమెంటు సభ్యుడు కూడా అయిన ప్రధానమంత్రి, "చైతన్యవంతులైన కాశీ ప్రజలు దేశానికి దిశా నిర్దేశం చేసేలా పని చేశారు. షార్ట్ కట్ పద్ధతులేవీ దేశానికి మేలు చేయవని కాశీ ప్రజలు దేశం మొత్తానికి సందేశం తెలియజేశారు. '' అని అన్నారు. తాత్కాలిక, షార్ట్ కట్ పద్ధతులను కాకుండా దీర్ఘకాలిక పరిష్కారాలను ప్రజలు కోరుకుంటున్నారని ఆయన స్థానిక ప్రజలను అభినందించారు. మౌలిక సదుపాయాలలో అభివృద్ధి, ఇతర రంగాలలో అభివృద్ధి కాశీ నగరానికి పర్యాటకాన్ని తీసుకువచ్చిందని, వ్యాపారానికి , సులభతర జీవనానికి కొత్త అవకాశాలు వచ్చాయని ప్రధానమంత్రి అన్నారు.

రానున్న శ్రావణమాసం గురించి ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి, దేశవ్యాప్తంగా గల బాబా విశ్వనాథ్‌భక్తులు పెద్దసంఖ్యలో కాశీ తరలి రానున్నారని చెప్పారు. విశ్వనాథ్ థామ్ ప్రాజెక్టు పూర్తి అయిన తర్వాత జరుగుతున్న తొలి శ్రావణమాసం ఇది అని ప్రధానమంత్రి అన్నారు. కాశీ విశ్వనాథ్ థామ్‌కు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా గత కొద్ది నెలలుగా ఎంతో ఉత్సాహం నెలకొన్న విషయం ప్రజలు గమనించారని ఆయన అన్నారు. భక్తులకు కాశీ యాత్ర గొప్పనుభవాన్ని మిగిల్చేలా చేసేందుకు , యాత్రను వీలైనంత సులభతరం చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తున్నట్టు చెప్పారు. వివిధ విశ్వాసాలకు సంబంధించిన యాత్రలను సులభతరం, అనుకూలంగా ఉండేట్టు చేస్తున్నట్టు చెప్పారు.

" మాకు అభివృద్ధి అంటే మెరుగులు కాదు. మాకు అభివృద్ధి అంటే పేదలు, అణగారిన వర్గాలు, వెనుకబడిన తరగతులు, గిరిజనులు,తల్లులు, ఆడబిడ్డల సాధికారత. '' అని ప్రధానమంత్రి అన్నారు. దేశంలోన ప్రతి ఇంటికీ పక్కా ఇంటి సదుపాయం కల్పించేందుకు, పైపు ద్వారా నీటని సరఫరా చేసేందుకు నిరంతరం చర్యలుతీసుకుం టున్నట్టు చెప్పారు.

ప్రభుత్వం ఎప్పుడూ పేదల సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తున్నదని, వారి బాధలలో, సంతోషాలలో అండగా నిలిచేందుకు ప్రయత్నిస్తున్నదని అన్నారు. కరోనా ఉచిత వాక్సిన్‌నుంచి పేదలకు ఉచిత రేషన్ పంపిణీ వరకు పేదలకు సేవ చేసే విషయంలో ప్రభుత్వం ఏ ఒక్క అవకాశాన్నీ విడిచిపెట్టలేదని ప్రధానమంత్రి చెప్పారు. డిజిటల్ ఇండియా, ఆయుష్మాన్ భారత్, వైద్య మౌలిక సదుపాయాల పెంపు వంటివి ప్రజలకు నూతన అవకాశాలను కల్పిస్తున్నాయని అన్నారు.

ఒక వైపుమనం సిఎన్‌జి ఆధారిత వాహనాల ద్వారా నగరాలను వాయు కాలుష్య రహితం చేస్తున్నామని, మరోవైపు డీజిల్, పెట్రోలు తో నడిచే పడవలకు సిఎన్‌జి అమర్చడం ద్వారా గంగానది పరిక్షణ పట్ల శ్రద్ధ వహిస్తున్నామని ప్రధానమంత్రి అన్నారు.

కొత్త క్రీడా కేంద్రం ఏర్పాటుతో క్రీడాకారులలో ఉత్సాహం వెల్లివిరిస్తోందని ప్రధానమంత్రి చెప్పారు. ఒలింపిక్‌క్రీడలకు అవసరమైన అన్ని సదుపాయాలను కాశీలోకల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు ప్రధానమంత్రి చెప్పారు. సిగ్రాలో పునర్ అభివృద్ధి చేసిన స్టేడియంలో అంతర్జాతీయ సదుపాయాలు కల్పిస్తున్నట్టు శ్రీనరేంద్రమోదీ చెప్పారు. ఆరు దశాబ్దాల నాటి స్టేడియంలో 21 వ శతాబ్దపు అవసరాలకు అనుగుణమైన సదుపాయాలు కల్పిస్తున్నట్టు ప్రధానమంత్రి చెప్పారు.

గంగా నదిని, వారణాశి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిందిగా ప్రధానమంత్రి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల తోడ్పాటు, బాబా విశ్వనాథ్ ఆశీస్సులతో నగరానికి సంకల్పించిన పనులన్నీ పూర్తికాగలవన్న ఆకాంక్షను ఆయన వ్యక్తం చేశారు.

పలు అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలుః

గత 8 సంవత్సరాలలో ప్రధానమంత్రి వారణాశిలో పలు మౌలికసదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టిపెట్టారు. దీనితో వారణాశి నగరం రూపురేఖలు మారిపోయాయి. ఈ కృషికి ప్రత్యేక కారణం, ప్రజల సులభతర జీవనాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడం. ఇందుకు సంబంధించి మరింత ముందడుగు దిశగా చర్యలు తీసుకుంటూ ప్రధానమంత్రి 590 కోట్ల రూపాయల విలువగల ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో పలు ప్రాజెక్టులు వారణాశి స్మార్ట్ సిటీ, అర్బన్ ప్రాజెక్టుల పరిధిలో ఉన్నాయి. ఇందులో నమో ఘాట్ తొలి దశ పునర్ అభివృద్ధి, స్నానాల జెట్టి, 500 పడవలకు సంబంధించి డీజిల్, పెట్రోలు ఇంజిన్లను సి.ఎన్.జి కి మార్చడం, పాత కాశీలోని కామేశ్వర మహదేవ్ వార్డు పునర్ అభివృద్ధి, హర్‌హువా, దాసేపూర్ గ్రామాలలో 600 ఇడబ్ల్యుఎస్ ఫ్లాట్ల నిర్మాణం, లహరతర-చౌకాఘాట్ ఫ్లై ఓవర్ కింద కొత్త వెండింగ్ జోన్, అర్బన్ ప్లేస్, దశాశ్వమేధ ఘాట్‌లో పర్యాటక సదుపాయాలు, మార్కెట్ కాంప్లెక్స్, నాగ్వా వద్ద ఐపిడిఎస్ వర్క్ ఫేజ్ 3 కింద 33 కె.వి సబ్‌స్టేషన్ నిర్మాణం వంటివి ఉన్నాయి.

పలు రోడ్డు ప్రాజెక్టులను కూడా ప్రధానమంత్రి ప్రారంభించారు. ఇందులో ఆబట్‌పూర్ -కాప్‌సేథి- బడోహి రోడ్ కు సంబంధించి నాలుగు లేన్ల రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్ ఒ.బి)ని, సెంట్రల్ జైల్ రోడ్ లో వరుణా నదిపై బ్రిడ్జిని, పిండారా- కథిరాన్ రోడ్ విస్తరణ పనులను, ఫూల్‌పూర్ -సింధౌరా లింక్ రోడ్ వెడల్పు పనులను, 8 గ్రామీణ రోడ్లను పటిష్టం చేసే పనులను, 7 పిఎంజిఎస్‌వై రోడ్ల ను ధర్సౌనా- సింధూరారోడ్‌లో విస్తరణకు సంబంధించిన పనులను ప్రధానమంత్రి ప్రారంభించారు.

జిల్లాలో మురుగునీటి వ్యవస్థ మెరుగు, నీటి సరఫరా ప్రాజెక్టులకు సంబంధించిన వివిధ ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభించారు. అలాగే వారణాశి నగరంలో ఓల్డ్ ట్రంక్‌సీవర్ లైన్‌ను ట్రెంచ్ లెస్ టెక్నాలజీతో తిరిగి తీర్చిదిద్దడం, మురుగునీటి సరఫరా లైన్ల ఏర్పాటు, వారణాశి ప్రాంతంలో 25000 ఇళ్లకు మురుగునీటి కనక్షన్ ఏర్పాటు, సిస్ వరుణ ప్రాంతంలో లీకేజి ని చక్కదిద్దే పనులు, తాతేపూర్ గ్రామంలో గ్రామీణ మంచినీటి పథకం పనులు, మహగాన్‌లో ఐటిఐ ప్రారంభం వివిధ సామాజిక విద్యా సంబంధ పనులు , రామ్‌నగర్‌లో ని బిహెచ్‌యు ప్రభుత్వ బాలికల పాఠశాలలో వేదిక్ విజ్ఞాన కేంద్రం రెండో దశ , దుర్గాకుండ్ లో ని ప్రభుత్వ వయోధిక మహిళా వసతి గృహంలో థీమ్ పార్కు వంటి వాటిని ప్రధానమంత్రి ప్రారంభించారు.

బడాలాల్ పూర్‌లోని డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో ప్రధానమంత్రి సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, సింథటిక్ బాస్కెట్‌బాల్ కోర్టును ప్రధానమంత్రి ప్రారంభించారు. అలాగే సింధౌరాలో నాన్ రెసిడెన్షియల్ పోలీస్ స్టేషన్ బిల్డింగ్, వివిధ పోలీస్, ఫైర్ సేఫ్టీ ప్రాజెక్టులు , హాస్టల్ రూమ్‌ల నిర్మాణం, మిర్జామురద్, చోలాపూర్, ఝూన్సా, కాప్‌సేథి పోలీస్ స్టేషన్ల లో హాస్టల్ రూమ్‌లు, బారక్ ల నిర్మాణం, పింద్రాలో అగ్నిమాకప వ్యవస్థా కేంద్ర భవనాన్ని ప్రధానమంత్రి ప్రారంభించారు.

ఈ కార్యక్రమం సందర్భంగా ప్రధానమంత్రి సుమారు 1200 కోట్ల రూపాయల విలువగల ప్రాజెక్టులకు శంకుస్థాపనచేశారు . వీటిలో వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ఉన్నాయి. అవి లహర్‌తారా- బిహెచ్‌యు నుంచి విజయ సినిమా వరకు ఆరు లైన్ల రోడ్డు విస్తరణ, పందేపూర్ ఫ్లైఓవర్‌నుంచి రింగ్ రోడ్ వరకు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ, కుచహెరి నుంచి సంధహ వరకు నాలుగు లైన్ల రోడ్ల విస్తరణ, వారణాశి బడోహి గ్రామీణ రోడ్డు పటిష్ట పరచడం, ఐదు కొత్త రోడ్ల నిర్మాణం, వారణాశిలో నాలుగు సిసి రోడ్ల నిర్మాణం, బబతాపూర్- చౌబేపూర్ రోడ్ లో బబతాపూర్ రైల్వేస్టేషన్ వద్ద ఆర్.ఒ.బి నిర్మాణం వంటివి ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు వారణాశి నగరంలో , గ్రామీణ రోడ్లపైన ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించనున్నాయి.

ఈ ప్రాంతంలో పర్యాటకానికి మరింత ఊతం ఇచ్చేందుకు ప్రధానమంత్రి పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఇందులో సారనాథ్ బుద్దిస్ట్ సర్క్యూట్ అభివృద్ధి పనులు ఉన్నాయి. ఇవి ప్రపంచబ్యాంకు సహాయంతో యుపి పేదల అనుకూల పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా చేపడుతున్నది. అష్ట వినాయక, ద్వాదశ జ్యోతిర్లంగ యాత్ర, అష్టభైరవ, నవ గౌరీయాత్ర కు సంబంధించి పావన్ పథ్ నిర్మాణ పనులు , పంచకోశి పరిక్రమ యాత్రా మార్గం, పాత కాశీలో పర్యాటక అభివృద్ధికి సంబంధించిన పలు పనులకు శంకు స్థాపనచేశారు. సిగ్రాలో క్రీడా స్టేడియం పునర్ అభివృద్ధి తొలి దశ పనులకు కూడా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు.

2022-23 మొదటి త్రైమాసికంలో 79% పెరిగి 27.7 మిలియన్ టన్నులకు చేరుకున్న క్యాప్టివ్ & కమర్షియల్ బొగ్గు బ్లాక్‌ల ఉత్పత్తి

న్యూఢిల్లీ, జులై 8: 2022-23 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో బొగ్గు బ్లాకుల నుండి ఉత్పత్తిని బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ఒ నామినేటెడ్ అథారిటీ 6 జూలై 2022న సమీక్షించారు. మొదటి త్రైమాసికంలో సాధించిన బొగ్గు ఉత్పత్తి 27.7 మిలియన్ టన్నులు, ఇది 2021-22 ఆర్థిక సంవత్సరంలో అదే కాలంలో ఉత్పత్తి చేయబడిన 15.5 మిలియన్-టన్నుల బొగ్గు కంటే 79% ఎక్కువ.

అధిక వృద్ధిని సాధించడంలో బొగ్గు బ్లాక్‌ల కేటాయింపుదారుల కృషిని మంత్రిత్వ శాఖ ప్రశంసించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో బొగ్గు బ్లాకుల నుండి 32 మిలియన్ టన్నుల లక్ష్య ఉత్పత్తిని సాధించగలమని ఆశాభావం వ్యక్తం చేసింది. వాణిజ్య వేలం సంస్కరణల క్రింద 2021లో వేలం వేయబడిన రెండు గనులు మొదటి త్రైమాసికంలో 1.57 మిలియన్ టన్నుల ఉత్పత్తిని ప్రారంభించాయని తెలిపింది.

ప్రస్తుతం, మొత్తం 36 క్యాప్టివ్ మరియు కమర్షియల్ గనులు ఉత్పత్తిలో ఉన్నాయి. ఈ సంవత్సరంలో కనీసం 12 కొత్త గనులు ఉత్పత్తిని ప్రారంభించవచ్చని భావిస్తున్నారు. దేశంలో బొగ్గు డిమాండ్‌ను తీర్చేందుకు ఇది గణనీయంగా దోహదపడుతుంది.

ఇంకా, ప్రాజెక్ట్ నిర్వాహకులు తాము చేసిన ప్రయత్నాలను, ఎదుర్కొంటున్న సవాళ్లను కూడా పంచుకున్నారు. సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని బొగ్గు మంత్రిత్వ శాఖ హామీ ఇచ్చింది.

తక్షణమే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలి.. ఏక్‌నాథ్‌కు థాకరే సవాల్

ముంబై,జులై 8: సీఎం పదవి నుంచి వైదొలిగిన తర్వాత తొలిసారిగా ఉద్ధవ్ థాకరే తన మద్దతుదారులు ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. మహారాష్ట్రలో తక్షణమే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. శివసేన పార్టీ సింబల్‌ను రెబెల్స్ ఉపయోగించుకునే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

ఇవాళే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని అధికారంలో ఉన్న నాయకులకు సవాల్ విసురుతున్నానని థాకరే పేర్కొన్నారు. ఒక వేళ తాము తప్పు చేస్తే ప్రజలు తమను ఇంటికి పంపిస్తారు. ఒక వేళ వారు తప్పు చేస్తే వారిని ఇంటికి పంపిచేస్తారని పేర్కొన్నారు. ఇక శివసేన నుంచి పార్టీ గుర్తును రెబెల్స్ తీసుకోలేరని చెప్పారు. ఏదేమైనప్పటికీ ప్రజలు సింబల్‌ను చూడరని, నాయకుల వ్యక్తిత్వాన్ని చూస్తారని తెలిపారు. గత రెండున్నరేండ్ల నుంచి తనను, తన కుటుంబాన్ని బీజేపీ టార్గెట్ చేసినప్పుడు.. ఇప్పటి రెబెల్స్ సైలెంట్‌గా ఉన్నారని ఉద్ధవ్ థాకరే గుర్తు చేశారు. శివసేనలో ఉంటూ సొంత పార్టీ నాయకులకు ద్రోహం చేస్తారని ఊహించలేదని థాకరే అన్నారు. బెదిరింపులు వచ్చినా తనతో ఉన్న 16 మంది ఎమ్మెల్యేలను చూసి గర్వపడుతున్నాను. రెబెల్స్ టూర్‌కు వెళ్లకుండా తనతో వచ్చి మాట్లాడి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. తన కుటుంబాన్ని దుర్భషలాడిన వారితో ఉన్నవారు తనకు అవసరం లేదన్నారు. ఏక్‌నాథ్ షిండేకు మద్దతుగా వెళ్లిన వారిలో తనను గౌరవించే వారు ఉన్నారో లేదో మీరే నిర్ణయించుకోవాలని రెబెల్స్‌ను ఉద్దేశించి థాకరే అన్నారు. శివసేన తిరుగుబాటు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్ సోమవారం విచారణకు రానుంది. ప్రభుత్వ ఏర్పాటుకు ఏక్‌నాథ్ షిండేను ఆహ్వానించాలన్న గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీ నిర్ణయానికి వ్యతిరేకంగా కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై కూడా సోమవారం విచారణ జరగనుంది. అయితే శివసేన భవిష్యత్‌తో పాటు భారత ప్రజాస్వామ్య భవిష్యత్‌ను కూడా సుప్రీంకోర్టు ఆ రోజు నిర్ణయిస్తుందని ఉద్ధవ్ థాకరే పేర్కొన్నారు.

గ్యాస్ ధరల పెంపుపై జెడ్పీటీసీ నిరసన.. కట్టెల పొయ్యిపై వంట!

కరీంనగర్ , జులై 8: (నేటినిజం ప్రతినిధి): గ్యాస్ సిలిండర్ ధరల పెంపును నిరసిస్తూ పెద్దపల్లి జిల్లా పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. విపరితంగా పెరుగుతున్న గ్యాస్ ధరలను నిరసిస్తూ తన ఇంట్లో ఖాళీ సిలిండర్ పై కూర్చుని కట్టెల పొయ్యి మీద వంట చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2014లో ఎన్డీఏ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన సమయంలో 410 రూపాయలున్న గ్యాస్ సిలెండర్ ధర ప్రస్తుతం 1105 రూపాయలకు చేరుకుందన్నారు.

పెట్రో ఉత్పత్తులతో పాటు గ్యాస్ ధరల పెంపు వల్ల సామాన్యులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని సంధ్యారాణి విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే కేంద్రం మాత్రం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడటం సిగ్గుచేటని మండిపడ్డారు. పెంచిన గ్యాస్ సిలెండర్ ధరలు తగ్గించి మహిళలకు ఇబ్బంది లేకుండా చేయాలని డిమాండ్ చేశారు.

కామన్వెల్త్ గేమ్స్ 2022కు భారత్ సంసిద్ధతను సమీక్షించిన అనురాగ్ సింగ్ ఠాకూర్ ఒలింపిక్స్ తరువాత పెరిగిన శిక్షణ , పోటీ వేగం

న్యూఢిల్లీ, జులై 8: కేంద్ర యువజన వ్యవహారాలు , క్రీడల శాఖ మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ గురువారం మిషన్ ఒలింపిక్ సెల్ (ఎంఒసి) సమావేశంలో కామన్వెల్త్ గేమ్స్ 2022 కు భారతదేశ సంసిద్ధత ను సమీక్షించారు. రాబోయే సిడబ్ల్యుజి లో మొత్తం 215 మంది అథ్లెట్లు భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తారు.

మాజీ లాంగ్ జంపర్ అంజు బాబీ జార్జ్, మాజీ హాకీ ప్లేయర్ విరేన్ రాస్కిన్హా, మాజీ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి మోనాలిసా బారువా, మాజీ రెజ్లర్ యోగేశ్వర్ దత్, మాజీ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి తృప్తి ముర్గుండే ఎంఒసి సమావేశానికి హాజరయ్యారు.

'అథ్లెట్ల సన్నద్ధత జోరుగా సాగుతోంది. ఒలింపిక్స్ అనంతరం శిక్షణ, పోటీల వేగాన్ని పెంచినందుకు నేను సంతోషిస్తున్నాను, ఒలింపిక్స్, పారాలింపిక్స్ తర్వాత కూడా విజయ పరంపర కొనసాగాలని ఆశిస్తున్నాం' అని శ్రీ ఠాకూర్ అన్నారు.

సమీక్ష సందర్భంగా, భారతదేశ సన్నద్ధతకు సంబంధించిన వివిధ అంశాలు వెలుగులోకి వచ్చాయి. టోక్యో 2020 ఒలింపిక్స్ తరువాత అథ్లెట్లు జాతీయ శిబిరాల్లో శిక్షణ , శిక్షణ పోటీలో బహుళ అంతర్జాతీయ ఎక్స్పోజర్లతో సహా పూర్తి స్థాయి శిక్షణకు తిరిగి చేరుకున్నారు. ఇప్పటివరకు - కేంద్ర ప్రభుత్వం బర్మింగ్ హామ్ 2022లో భారత దేశం పోటీ పడనున్న విభాగాల్లో 111 ఎక్స్ పోజర్ ట్రిప్పులకు సహాయం చేసింది.

జాతీయ క్రీడా సమాఖ్యలు (ఎన్ ఎస్ ఎఫ్) కూడా జాతీయ శిబిరాలను నిర్వహించడానికి కలిసి పనిచేస్తున్నాయి.

అనేక మంది ప్రముఖ అథ్లెట్లు వారి శిక్షణా ప్రణాళిక ప్రకారం, విదేశాలలో ప్రభుత్వ ఖర్చుతో ఒలింపిక్స్ అనంతర శిక్షణ పొందుతున్నారు.

ఒలింపిక్ క్రీడల తరువాత శిక్షణకు తిరిగి వచ్చినప్పటి నుండి, జావెలిన్ థ్రోవర్ నీరజ్ చోప్రా చులా విస్టా (యుఎస్), అంతల్యా (టర్కీ) ఫిన్లాండ్ లో ఉంటున్నాడు. వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను సెయింట్ లూయిస్ (యుఎస్) లో సమయం గడిపాడు, స్పెషలిస్ట్ కోచ్ డాక్టర్ ఆరోన్ హోర్షిగ్ తో శిక్షణ పొందాడు.

ఏప్రిల్ 2022 నుండి కోచ్ స్కాట్ సైమన్స్ తో కలిసి కొలరాడో స్ప్రింగ్స్ (యుఎస్) లో ఉన్న స్టీపుల్‌ఛేజర్ అవినాష్ సాబ్లే తో ఉండగా, సైక్లింగ్ జట్టు మూడు నెలలుగా స్లోవేనియా పోర్చుగల్ లో ఉంది. ఇటీవల, టేబుల్ టెన్నిస్ , బాక్సింగ్ బృందాల కోసం పోర్చుగల్, రిపబ్లిక్ ఆఫ్ ఐర్లాండ్ లో ఎక్స్పోజర్ పర్యటనలు కూడా సిడబ్ల్యుజి 2022 కు ముందస్తుగా ఖరారు అయ్యాయి.

నా కూతురు ఒంటరి పోరాటం చేస్తోంది, ఆమెకు సపోర్ట్ కావాలే.. అందుకే రాజీనామా: వైఎస్ విజయమ్మ

అమరావతి, జులై 8: తన కుమార్తె షర్మిలకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ గౌరవాధ్యక్షురాలు పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లి విజయమ్మ శుక్రవారం వెల్లడించారు. తెలంగాణలో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ పేరుతో కొత్త పార్టీ పెట్టిన తన కూతురు షర్మిలకు సపోర్ట్? చేయడానికే ఈ రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. పార్టీ ప్లీనరీ సందర్భంగా విజయమ్మ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

ప్లీనరీ సమావేశంలో విజయమ్మ మాట్లాడుతూ.. 'ఆయన (వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి) కష్టాల్లో ఉన్నప్పుడు నేను ఆయన వెంటే ఉన్నాను. ఇప్పుడు ఇక్కడ నా కొడుకు సంతోషంగా ఉన్నాడు.

అక్కడ నా కూతురు (వైఎస్ షర్మిల) ఒంటరి పోరాటం చేస్తోంది. నేను ఆమెకు మద్దతు ఇవ్వకుంటే అన్యాయం జరుగుతుంది.. నేను ఈ విషయాలన్నీ మీకు చెబుతున్నాను, నన్ను క్షమించమని అందరినీ అభ్యర్థిస్తున్నాను. అని విజయమ్మ సభా వేదికగా కోరింది.

తెలంగాణలో షర్మిల ఒంటరి పోరాటం చేస్తున్నారని వైఎస్? విజయమ్మ అన్నారు. రాజశేఖరరెడ్డి భార్యగా, షర్మిల తల్లిగా నేను ఆమెకు అండగా నిలవాలని నా హృదయం చెబుతోందని తెలిపారు. అంతకుముందు రోజు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్లీనరీని నిర్వహించబోతున్నట్లు ఆంధ్రప్రదేశ్ మంత్రి జి. అమర్‌నాథ్ అన్నారు. పార్టీకి 9అజెండాలు ఉంటాయని, అందులో 5 అంశాలపై నేడు (శుక్రవారం), 4 అంశాలపై రేపు (శనివారం) చర్చిస్తామని చెప్పారు. రేపు పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక జరగనుంది.

ఇక.. రాజ్యసభ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నేత వీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ పార్టీ ఏర్పాటైన తర్వాత ఇది మూడో ప్లీనరీ అని, అయితే 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరగడం ఇదే తొలిసారని అన్నారు. మొదటి రోజు (జూలై 8) ప్లీనరీకి సుమారు 1.5 లక్షల మంది ప్రతినిధులు హాజరవుతారని, రెండో రోజు (జూలై 9) దాదాపు 4.5 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్టు తెలుస్తోంది.

సరిహద్దుల్లో రెచ్చగొడుతున్న చైనా.. ఎల్ఏసీ వద్ద ఎగిరిన డ్రాగన్ ఎయిర్‌క్రాఫ్ట్!

న్యూఢిల్లీ, జులై 8: దుందుడుకు చర్యలతో కవ్విస్తున్న చైనా దుస్సాహసానికి తెగబడుతోంది. సరిహద్దుల్లో మరోసారి డ్రాగన్ రెచ్చిపోయింది. లడఖ్‌లో జూన్ చివరి వారంలో నియంత్రణ రేఖ (ఎల్ఏసీ) వెంబడి భారత స్థావరాలకు అతి సమీపంలో చైనా విమానం ఎగిరింది. వెంటనే అప్రమత్తమైన భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఎలాంటి దుస్సాహసం ఎదురైనా తిప్పికొట్టేందుకు రెడీగా ఉందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. తూర్పు లడఖ్ ప్రాంతంలో భారత్ గగనతలంలోకి ప్రవేశించేందుకు డ్రాగన్ కొద్దినెలలుగా ప్రయత్నిస్తున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుందని అధికార వర్గాలు తెలిపాయి.సరిహద్దు ప్రాంతంలో మోహరించిన ఓ ఐఏఎఫ్ రాడార్ చైనా విమాన కదలికలను పసిగట్టింది. తూర్పు లడఖ్‌లో తన ఆధీనంలో ఉన్న ప్రాంతాల్లో చైనా ఎయిర్ ఫోర్స్ భారీ విన్యాసాలు చేపట్టిన క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిపై ఉన్నతాధికారులు చైనా దృష్టికి తీసుకువెళ్లి భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా నిరోధించాలని కోరారు. 2020 తరహాలో సరిహద్దుల్లో చైనా ఎలాంటి దుస్సాహసానికి తెగబడినా తిప్పికొట్టేందుకు భారత్ రెడీగా ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

వర్షాలకు కూలిన కోర్టు గోడ.. తప్పిన పెను ప్రమాదం..

మెదక్, జులై 8 (నేటినిజం ప్రతినిధి): పట్టణంలోని మున్సిఫ్ కోర్టు ప్రధాన హాల్ గోడ గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి తడిసి గురువారం రాత్రి కూలిపోయింది. రాత్రి సమయంలో కోర్టు గోడ కూలడం వల్ల ఎటువంటి ప్రమాదం జరగలేదని న్యాయవాదులతో పాటు ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. కోర్టు వ్యవహారాలు కొనసాగుతున్న సమయంలో గోడ కూలినట్లయితే న్యాయవాదులు, ప్రజలకు ప్రమాదం జరిగి ఉండేదని అన్నారు.

గత 35 సంవత్సరాల కింద నిర్మించిన భవనం అయినందున ఆ భవనం శిథిలావస్థకు చేరిందని, ఈ విషయమై హై కోర్ట్ జడ్జి దృష్టికి గత ఆరు నెలల కిందట తీసుకువెళ్లిన పట్టించుకోలేదని న్యాయవాది అంజిరెడ్డి తెలిపారు. కోర్టు గోడ కూలడంతో భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉందని అన్నారు. ప్రస్తుతం కోర్టు ద్వారా న్యాయ సేవలను నిలిపివేయడం జరిగిందన్నారు. తాత్కాలికంగా భవనం ఏర్పాటు చేస్తే న్యాయ సేవలు ప్రారంభిస్తామని న్యాయవాదులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న జడ్జి అనిత శుక్రవారం ఉదయం కోర్టు వద్దకు వచ్చి కూలిన గోడను పరిశీలించారు.

రైల్వే స్టేషన్లపై నిఘా

హైదరాబాద్, జులై 8:: సురక్షిత ప్రయాణం, భద్రతే లక్ష్యంగా భారతీయ రైల్వేశాఖ దేశంలోని పలు రైల్వేస్టే షన్లను ఇంటర్నెట్ ప్రొటోకాల్ ఆధారిత వీడియో నిఘా నీడలోకి తేనుంది. నిర్భయ నిధుల ద్వారా మొదటిదశలో చేపట్టనున్న ఈ పథకంలో హైదరాబాద్ నగరంలోని 24 స్టేషన్లను ఎంపిక చేశారు. అడుగడుగునా సీసీ కెమెరాలు, ప్రవేశ ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్లు, పటిష్ట మైన పోలీసు భద్రత ఉండగానే సికింద్రాబాద్‌తో పాటు దేశ వ్యాప్తంగా పలు రైల్వేస్టే షన్ల లో వేలాదిమంది చొరబడి విధ్వంసం సృష్టి ంచిన నేపథ్యంలో సర్కార్ ఆగమేఘాల మీద రైల్వే స్టేషన్ల భద్రతపై దృష్టి పెట్టిందని తెలుస్తోంది. ప్రయాణికుల రద్దీని బట్టీ ఏ1, ఏ, బీ, సీ నాలుగు కేటగిరీలుగా విభజించింది. ఎంపిక చేసిన రైల్వే స్టేషన్లలోని విశ్రాంతి గదులు, రిజర్వేషన్ కౌంటర్లు, పార్కింగ్ స్థలాలు, ప్రవేశ ద్వారాలు, ప్లాట్‌ఫారాలు, పార్కింగ్ స్థలాలు, బుకింగ్ కౌంటర్లలో డోమ్ టైప్, పాన్ టిల్ట్ జూమ్ టైప్, బులెట్ టైప్, అల్ట్రా హెచ్‌డీ కెమెరాలను ప్రాధాన్యతను బట్టి ఏర్పాటు చేయనున్నారు. వీడియో నిఘా ప్రాజెక్టను 2023 జనవరిలోగా అందుబాటులోకి తెచ్చేందుకు రైల్వేశాఖ టెండర్లను సైతం ఖరారు చేసింది. రెండవ దశలో నగరంలోని మిగతా రైల్వే స్టేషన్ల లో ఈ పథకాన్ని అమలు చేయనున్నట్టు రైల్వే వర్గాలు తెలిపాయి.

ఈ అధునాతన వీడియో కెమెరాల ద్వారా ఎలాంటి పరిస్థితిలో ఉన్నా నేరస్థులను ఇట్టే గుర్తు పట్టే అవకాశం ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ అందజేసే విశ్లేషణ సాఫ్ట్ వేర్ నిర్వహణతో కెమెరా ట్యాంపరింగ్, వాహనాలను గుర్తిస్తారు. అలాగే రంగులు, ప్రవర్తన ద్వారా నేరస్థులను గుర్తించడం, ప్రమాదం జరిగినప్పుడు సంబంధిత ప్రాంతాన్ని ఐడెంటీ ఫై చేయడం తదితర ప్రయోజనాలు ఇంటర్నెట్ ప్రొటోకాల్ ఆధారిత వీ డియో నిఘా ద్వారా అందుబాటులోకి రానున్నాయి. కెమెరాలు, సర్వర్, యూపీఎస్, స్విచుల పర్యవేక్షణ కోసం నెట్‌వర్క్ మేనేజ్‌మెంట్ సిస్ట మ్ ఏర్పాటు చేయనున్నారు. వీటిని సంబంధిత సిబ్బంది ఏ బ్రౌజర్ నుంచైనా వీక్షించవచ్చు. సీసీ టీవీ కెమెరాల్లో రికార్డు అయిన ఈ వీడియోలను 30రోజుల వరకు అందుబాటులో ఉంచుతారు.

సీతాఫల్‌మండి, ఆర్ట్స్ కాలేజీ, డబీర్‌పుర, ఫలక్‌నామా, ఉప్పుగూడ, జామై ఉస్మానియా, మలక్‌పేట, విద్యానగర్, యాకత్‌పుర, భరత్‌నగర్, బోరబండ, చందానగర్, ఫతేపూర్ బ్రిడ్జి, హఫీజ్‌పేట,హైటెక్ సిటీ, జెమ్స్ స్ట్రీ ట్, ఖైరతాబాద్, లక్‌డీకాపూల్, నేచర్ క్యూర్ హాస్పిటల్, నెక్లెస్‌రోడ్, సంజీవయ్య పార్క్, బేగంపేట, లింగంపల్లి, కాచిగూడ మొదలగు 24 స్టే షన్ల ను మొదటి దశలో నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

తెలంగాణలో భారీ వర్షాలు.. పాలమూరులో వరదనీటిలో చిక్కుకున్న స్కూలు బస్సు!

మహబూబ్‌నగర్ జులై 8:రుతుపవనాల ప్రభావంతో తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇవ్వాల (శుక్రవారం) మహబూబ్ నగర్ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మాచన్ పల్లి–కోడూరు రూట్?లో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద భారీగా వరద నీరు చేరింది. ఈ వరదల్లో ఓ స్కూలు బస్సు చిక్కుకుపోయింది. ఓ ప్రైవేటు స్కూలుకు చెందిన బస్సు రామచంద్రపురం నుంచి సుగురుతండాకు వెళ్తుండగా రైల్వే అండర్ బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి నీటి ప్రవాహంలో ముందుకు కదల్లేకపోయింది.

బస్సులో సగానికి నీళ్లు చేరడంతో విద్యార్థులు హాహాకారాలు చేశారు. తీవ్ర భయాందోళనలతో కేకలు వేశారు. అయితే, స్థానికులు స్పందించి బస్సులో చిక్కుకున్న విద్యార్థులను కాపాడారు. అనంతరం బస్సును ఓ ట్రాక్టర్ కు కట్టి వరద నీటి ఉంచి బయటికి లాగారు.

నిష్పక్షపాతంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్లు పనిచేయాలి : ఏపీ గవర్నర్

అమరావతి, జులై 8: రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఉన్నత ప్రమాణాలు పాటిస్తూ, నిష్పక్షపాతంగా పనిచేయాలని ఏపీ గవర్నర్ హరిచందన్ బిశ్వభూషణ్ సూచించారు. విశాఖపట్నం వేదికగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధ్యక్షుల రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటి సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా విజయవాడ రాజ్‌భవన్ నుంచి వర్చువల్ మోడ్‌లో సమావేశానికి గవర్నర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతిభావంతుల వ్యవస్థను అందించేలా కమిషన్లు పని చేయాలని పేర్కొన్నారు.

సర్వీస్ కమిషన్లు వాటి లక్ష్యాలను చేరుకోవడంలో స్టాండింగ్ కమిటీ కీలక పాత్ర పోషిస్తోందని గుర్తు చేశారు. రాజ్యాంగబద్ధమైన హోదా, స్వతంత్ర అధికారాలను పరిరక్షించేలా కృషి చేయాలని కోరారు.

కాలానుగుణంగా నోటిఫికేషన్లు ఇస్తూ సకాలంలో పారదర్శకంగా నియామకాలు పూర్తి చేసే బాధ్యతల్లో ఒకటని గుర్తించుకోవాలని పేర్కొన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో విజయవాడలో జనన్నాథ రథయాత్రను ఏపీ గవర్నర్ ప్రారంభించారు. స్థానిక వజ్రమైదానం రథయాత్ర ప్రారంభం కాగా గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ రథం ముందు నీళ్లు చల్లి చీపురుతో తుడిచి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు జగన్నాథుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

ఆర్థిక మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మాలా సీతారామన్ అధ్యక్షతన నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

న్యూఢిల్లీ, జులై 8: నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కార్యకలాపాలను సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన అపెక్స్ మానిటరింగ్ అథారిటీ మొదటి సమావేశానికి ఆర్థిక మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ అధ్యక్షత వహించారు. అపెక్స్ మానిటరింగ్ అథారిటీలో ఆర్థిక మంత్రి చైర్‌పర్సన్, ఇన్‌ఛార్జ్ మంత్రి, వాణిజ్య ఆ పరిశ్రమల మంత్రిత్వ శాఖ, రైల్వే మంత్రి, రోడ్డు రవాణా ఆ హైవేల మంత్రి, షిప్పింగ్ మంత్రి, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ మరియు సంబంధిత రాష్ట్రాల ముఖ్యమంత్రి(లు) ఉంటారు. గుజరాత్, హర్యానా, కర్ణాటక, ఎం.పి. మహారాష్ట్ర మరియు ఉత్తరాఖండ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు; బీహార్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కేరళ, రాజస్థాన్‌ల మంత్రులతో పాటు అన్ని రాష్ట్రాల సీనియర్ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

సమావేశంలో ప్రసంగించిన శ్రీమతి సీతారామన్ ఇన్నాళ్లూ పనులు కొనసాగుతున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రులు, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. “ఈరోజు కొన్ని నోడ్‌లతో దాదాపు 3–4 రాష్ట్రాలతో ప్రారంభించినది 18 రాష్ట్రాలను కవర్ చేసింది మరియు మరింత సరళీకృత వాతావరణాన్ని చూస్తున్నందున పారిశ్రామిక అభివృద్ధికి పర్యావరణ వ్యవస్థ వేగాన్ని సంతరించుకుంది. ఇది వేగవంతమైన స్కేలింగ్ మరియు దాని ఫలితంగా ఎక్కువ సంచిత ప్రయోజనం ఉండాలి, మనం పొందగలుగుతాము ”అని చెప్పారు. భూ సేకరణను వేగవంతం చేయాలని రాష్ట్రాలను ఆమె కోరారు.

వనరుల సముచిత వినియోగాన్ని నిర్ధారించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పిన ఆర్థిక మంత్రి ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ మాస్టర్‌ప్లాన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో అన్ని పెట్టుబడులలో మరింత సమన్వయాన్ని తీసుకురావాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఇండస్ట్రియల్ కారిడార్లు, ఫ్రైట్ కారిడార్లు, డిఫెన్స్ కారిడార్లు, నిమ్జ్ (నేషనల్ ఇండస్ట్రియల్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్‌లు) పిఎల్ఐ ఆధారిత పరిశ్రమ పార్కులు, పిఎం–మిత్రా పార్కులు, మెడికల్ ఆ ఫార్మా పార్కులు, లాజిస్టిక్ పార్కులు వంటి అన్ని విభిన్న ప్రాజెక్టులను మ్యాప్ చేయాలని ఆమె నీతి ఆయోగ్‌ని కోరారు. వారిని పీఎం గతిశక్తి కిందకు తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. షిప్పింగ్ మంత్రిత్వ శాఖను వివిధ పారిశ్రామిక కారిడార్‌లకు అనుసంధానించబడిన అన్ని సముద్ర ఓడరేవులను అర్థవంతమైన అనుసంధానాలు ఉన్నాయో లేదో చూడాలని కూడా ఆర్థిక మంత్రి కోరారు. మానిటరింగ్ కమిటీ తదుపరి సమావేశాన్ని నవంబర్‌లో ఏర్పాటు చేయాలని ఆమె కోరారు.

వాణిజ్యం ఆ పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం ఆ ప్రజాపంపిణీ మరియు జౌళి శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. ఈ పారిశ్రామిక కారిడార్‌లలో త్వరగా పెట్టుబడిదారులను ఆకర్షించడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని మరియు వ్యాపారాలను ఆకర్షించడానికి ఎన్ఐసీడీఐటీ అలాగే రాష్ట్రాలు రోడ్ షోలు నిర్వహించాలని కోరారు. “మనం త్వరగా భూమిని కేటాయించాలి. పరిశ్రమ కోసం భూమి సరసమైన ధరను కలిగి ఉండాలి మరియు మేము వివిధ లీజు వ్యవధి, లీజు ప్రీమియం చెల్లింపు సౌలభ్యం, అద్దె మోడల్, లీజు కమ్ రెంట్ ఎంపిక వంటి వినూత్న మార్గాలను అనుమతించాలి. పెట్టుబడిదారులు నిశితంగా పరిశీలించే మరొక విషయం విద్యుత్ రేటు. మనం సరసమైన మరియు స్థిరమైన రేట్లు కలిగి ఉండాలి. అధిక విద్యుత్ ధరలు పరిశ్రమకు ప్రతిబంధకంగా ఉన్నాయి, ”అని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఉన్న పార్కులను సద్వినియోగం చేసుకోకుంటే కేంద్రం ఎలాంటి కొత్త పార్కుకు మద్దతు ఇవ్వదని శ్రీ గోయల్ హెచ్చరించారు.

రైల్వేలు, కమ్యూనికేషన్లు మరియు ఎలక్ట్రానిక్స్ ఆ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ..ప్రాజెక్ట్ నోడ్‌ల ప్రణాళికలో రైలు కనెక్టివిటీ అంతర్భాగంగా ఉండాలని మరియు రైల్వేల అవసరాన్ని పరిగణనలోకి తీసుకుని భూసేకరణ చేయవచ్చని అన్నారు. ప్రాంతీయ రైల్వేలు మరియు హైడ్రోజన్ రైలును ప్లాన్ చేస్తున్నామని, మౌలిక సదుపాయాల అభివృద్ధి ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలని ఆయన తెలియజేశారు. ఆప్టికల్ ఫైబర్ వేయడానికి డేటా సెంటర్లు మరియు డక్ట్‌ల కోసం ప్లాన్ చేయాలని ఎన్ఐసీడీఐటీని కూడా ఆయన కోరారు.

ఎలక్ట్రానిక్ తయారీ కోసం రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నోడ్‌లను కలిగి ఉండాలని శ్రీ వైష్ణవ్ కోరారు. ఇది అత్యధిక ఉపాధిని కలిగిస్తుందని తెలిపారు. “ఎలక్ట్రానిక్ తయారీకి భారీ అవకాశం ఉంది. విశ్వవ్యాప్త విలువ గొలుసు మొత్తం అవిశ్వసనీయ భాగస్వాముల నుండి దూరంగా మారుతోంది మరియు భారతదేశం విశ్వసనీయ భాగస్వామిగా చూడబడుతోంది. భారతదేశంలో చివరిగా ఎలక్ట్రానిక్ తయారీ సాధించిన విజయాన్ని ప్రపంచం చూసింది. ఎక్కడా లేని విధంగా మనం 76 బిలియన్ డాలర్లకు చేరుకున్నాము మరియు ఇప్పుడు అది రెండంకెలలో పెరుగుతోంది, ”అని మంత్రి తెలిపారు.

డీపీఐఐటీ సెక్రటరీ శ్రీ అనురాగ్ జైన్ ప్రభుత్వ ప్రయత్నాలకు అనుబంధంగా ఉంటుందని తెలియజేశారు. భారతదేశానికి చెందిన ఉత్పాదక సామర్థ్యాన్ని గ్రహించి ఎన్ఐసీడీసీ 32 నోడ్‌లు/ప్రాజెక్టలతో కూడిన పదకొండు (11) పారిశ్రామిక కారిడార్‌లను అభివృద్ధి చేస్తోంది. పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ కింద నిర్దేశించిన విజన్‌ని ముందుకు తీసుకెళ్లడం కోసం 04 దశల్లో అభివృద్ధి చేస్తుంది.

ప్రత్యేక కార్యదర్శి (లాజిస్టిక్స్) మరియు సీఈఓఎండీ, ఎన్ఐసీడీసీ శ్రీ అమృత్ లాల్ మీనా మాట్లాడుతూ గుజరాత్‌లోని ధోలేరా స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (డిఎస్ఐఆర్) అనే 4 అభివృద్ధి చెందిన భవిష్యత్ “స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీలను” అందించగలిగిందని తెలియజేశారు; షేంద్ర బిడ్కిన్ ఇండస్ట్రియల్ ఏరియా (ఎస్‌బిఐఏ), మహారాష్ట్రలోని ఔరంగాబాద్; ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్, ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడా (ఐఐటీజీఎన్); మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్, విక్రమ్ ఉద్యోగపురి (ఐఐటీవియూ), ఆంధ్రప్రదేశ్ మరియు కర్నాటక ప్రభుత్వాల మద్దతుతో కృష్ణపట్నం మరియు తుమకూరులో రెండు కొత్త నోడ్‌లు అమలు దిశగా ముందుకు సాగుతున్నాయని అన్నారు. ఎన్ఐసీడీసీ హర్యానాలోని నంగల్ చౌదరి మరియు ఉత్తరప్రదేశ్‌లోని దాద్రీలో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ హబ్‌లను (ఎంఎంఎల్‌హెచ్) కూడా అభివృద్ధి చేస్తోంది. వీటితో పాటు ఉత్తరప్రదేశ్‌లోని బోరాకిలో మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ హబ్ (ఎంఎంటీహెచ్) అభివృద్ధి చేయబడుతోంది.

ఇప్పటి వరకు 979 ఎకరాల భూమితో కూడిన 201 ప్లాట్లు వివిధ జాతీయ/బహుళ జాతీయ పారిశ్రామిక యూనిట్లకు రూ. 17,500 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడితో కేటాయించబడ్డాయి. అలాగే 23,000 మందికి పైగా ఉపాధి అవకాశాలు అందిస్తున్నాయి. ఇప్పటికే 12 యూనిట్లలో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం కాగా దాదాపు 40 కంపెనీలు ఫ్యాక్టరీలను ఏర్పాటు చేస్తున్నాయి. పారిశ్రామిక, వాణిజ్య, నివాస, సంస్థాగత మొదలైన వివిధ అవసరాల కోసం 5400 ఎకరాలకు పైగా అభివృద్ధి చెందిన భూమి తక్షణ కేటాయింపు కోసం అందుబాటులో ఉంది. ఇండస్ట్రియల్ కారిడార్ ప్రోగ్రామ్ కింద ప్లాట్ కేటాయింపుదారులు వాణిజ్య ఉత్పత్తికి వెళ్లే వరకు పూర్తి హ్యాండ్ హోల్డింగ్ మద్దతు అందించబడుతుంది.

ఎన్ఐసీడీసీ లిమిటెడ్ అనేది డిపిఐఐటీ, వాణిజ్య ఆ పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన అడ్మినిస్ట్రేటివ్ కంట్రోల్ కింద ఒక స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పివి). ఇది ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ కార్యకలాపాలను నిర్వహిస్తుంది మరియు ‘నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రోగ్రామ్’ కింద వివిధ పారిశ్రామిక కారిడార్ ప్రాజెక్ట్‌ల అమలును సమన్వయం చేస్తుంది. ఈ కార్యక్రమం కింద ఎన్ఐసీడీసీ గుజరాత్‌లోని ధోలేరా స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (డిఎస్ఐఆర్) షేంద్ర బిడ్కిన్ ఇండస్ట్రియల్ ఏరియా (ఎస్‌బిఐఏ), మహారాష్ట్రలోని ఔరంగాబాద్; ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్, ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడా (ఐఐటీజీఎన్); ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్, మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో విక్రమ్ ఉద్యోగ్‌పురి (ఐఐటీవియూ) ఇప్పటికే పరిశ్రమల కోసం ప్లాట్ స్థాయి వరకు ప్లగ్ అండ్ ప్లే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో అభివృద్ధి చేయబడింది.

ఈ కార్యక్రమానికి బడ్జెట్ లభ్యత ఎప్పుడూ ఆందోళన కలిగించే అంశం కాదన్న ఆర్థిక మంత్రి హామీతో సమావేశం ముగిసింది. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద ప్రాజెక్టులు దేశంలో అభివృద్ధికి ముఖ్య చిహ్నంగా ఉండేలా ఆర్థిక మంత్రిత్వ శాఖ అన్ని సహాయ సహకారాలను అందజేస్తుంది.

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్ఆర్‌బి) అధిపతుల సమావేశం

న్యూఢిల్లీ, జులై 8: ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్ఆర్‌బి)లో అమలు జరుగుతున్న నిర్వహణా, పరిపాలన సంస్కరణలు మరియు పశుసంవర్ధక, పాడి పరిశ్రమ మరియు మత్స్య పరిశ్రమల కోసం అమలు జరుగుతున్న కిసాన్ క్రెడిట్ స్కీమ్ (కెసిసి) పనితీరును కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్ఆర్‌బి) అధిపతుల సమావేశంలో సమీక్షించారు. పశుసంవర్ధక, పాడి పరిశ్రమ మరియు మత్స్య పరిశ్రమల కోసం అమలు జరుగుతున్న కిసాన్ క్రెడిట్ స్కీమ్ (కెసిసి) పనితీరును కూడా మంత్రి సమీక్షించారు. ఆర్ఆర్‌బిల పనితీరును శ్రీమతి నిర్మలా సీతారామన్ వాటి స్పాన్సర్ బ్యాంకుల అధిపతులు , ఆర్ఆర్‌బి ల చైర్మన్లతో సమీక్షించారు.గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు అవసరమైన రుణ సౌకర్యం అందించి, ఆర్థిక స్వావలంబన సాధన దిశలో ఆర్ఆర్‌బిలు పోషిస్తున్న కీలక పాత్రను మంత్రి ప్రస్తావించారు. ఆర్ఆర్‌బిల పనితీరును మెరుగు పరిచి వాటిని మరింత బలోపేతం చేసేందుకు, మహమ్మారి అనంతరం నెలకొన్న పరిస్థితుల నుంచి అధిగమించేందుకు అవసరమైన నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని స్పాన్సర్ బ్యాంకులకు ఆర్థిక మంత్రి సూచించారు. ఆర్ఆర్‌బిలు సాంకేతిక పురోగతి సాధించే అంశంలో ప్రధాన పాత్ర పోషించాలని ఐబీఏ మరియు స్పాన్సర్ బ్యాంకులకు శ్రీమతి సీతారామన్ సలహా ఇచ్చారు.

ఆర్ఆర్‌బిలు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను చర్చించి, అన్ని బ్యాంకుల్లో అవి మేలు జరిగేలా చూసేందుకు ఒక వర్క్‌షాప్ నిర్వహించాలని శ్రీమతి సీతారామన్ సూచించారు.

జూలై నెలాఖరులోగా అకౌంట్ అగ్రిగేటర్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టాలని శ్రీమతి సీతారామన్ అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులను ఆదేశించారు.

పశుసంవర్ధక, పాడి పరిశ్రమ మరియు మత్స్య రంగానికి కెసిసి జారీ పురోగతిని శ్రీమతి సీతారామన్ సమీక్షించారు. సమావేశంలో కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి శ్రీ పురుషోత్తం రూపాలా, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ భగవత్ కిసన్‌రావ్ కరద్ పాల్గొన్నారు.

కెసిసి రుణాల ప్రయోజనాలను అత్యధిక సంఖ్యలో రైతులకు అందించే లక్ష్యంతో ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ కింద ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. 2.5 కోట్ల మంది రైతులకు 2 లక్షల కోట్ల రూపాయల కెసిసి రుణాలను అందించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం రూపొందింది.

జూలై 1, 2022 నాటికి 3.26 కోట్ల మంది రైతులకు (19.56 లక్షల పశు సంవర్ధక, పాడి పరిశ్రమ మరియు మత్స్య రైతులతో సహా) కెసిసి పథకం కింద 3.70 లక్షల కోట్ల రూపాయల రుణ పరపతిని అందించడం జరిగింది.

ఆర్థిక వ్యవస్థలో పశుసంవర్ధక మరియు మత్స్య పరిశ్రమల పాత్రను ఆర్థిక మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ రంగాల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని పెండింగ్ లో ఉన్నకెసిసి ధరఖాస్తుల పరిష్కారానికి కార్యాచరణ కార్యక్రమాన్ని సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. పశువుల పెంపకం, చేపల పెంపకం రంగాల్లో ఉన్న రైతులకు కెసిసి రుణ పరపతిని అందించేందుకు ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని బ్యాంకులకు ఆర్థిక మంత్రి సూచించారు.

పశుసంవర్ధక మరియు మత్స్య రంగాలకు కెసిసి రుణాలను అందించేందుకు బ్యాంకులు చేస్తున్న కృషిని శ్రీ రూపాల ప్రశంసించారు. కెసిసి పథకం కింద రుణాలు మంజూరు చేసేటప్పుడు చిన్న మత్స్యకారులు మరియు పశువుల పెంపకంలో నిమగ్నమై ఉన్న వారి ప్రత్యేక అవసరాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు.

పథకం ప్రయోజనాలు సాధ్యమైనంత ఎక్కువ మందికి అందేలా చూసేందుకు సంబంధిత వర్గాలతో పథకం పనితీరుపై తరచు సమీక్ష నిర్వహించాలని శ్రీమతి సీతారామన్ అధికారులను ఆదేశించారు. సమీక్షల వల్ల పథకం ప్రయోజనాలు గరిష్ట సంఖ్యలో అర్హులైన లబ్ధిదారులకు అందుతాయని మంత్రి అన్నారు.

డిజిటల్ మేళాలో స్టార్టప్‌ల ద్వారా ఇంటరాక్టివ్ రోబోట్‌లు, ఏఆర్/వీఆర్ ఆ డ్రోన్‌ల వంటి అత్యాధునిక భవిష్యత్తు సాంకేతికతలను ప్రదర్శన

న్యూఢిల్లీ, జులై 8: డిజిటల్ ఇండియా వీక్ కార్యక్రమంలో మూడవ రోజైన 6 జూలై 2022న గుజరాత్ ప్రభుత్వానికి సంబంధించిన వివిధ కార్యక్రమాలతో ప్రారంభమైంది. మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఆ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎంఈఐటీవై) అదనపు కార్యదర్శి డాక్టర్ రాజేంద్ర కుమార్ స్వాగత ప్రసంగం చేశారు. దీని తర్వాత ఎంఈఐటీవై కార్యదర్శి శ్రీ అల్కేష్ కుమార్ శర్మ ప్రత్యేక ప్రసంగం చేసారు. డిజిటల్ ఇండియా వీక్ 2022ని విజయవంతం చేయడంలో ఎంఈఐటీవైకి సహాయం చేసినందుకు గుజరాత్ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. డిజిటల్ ఇండియా వీక్ అనేది కేవలం వేడుక మాత్రమే కాదని, మంచి ఆలోచనలను క్రాస్ ఫర్టిలైజేషన్ చేయడానికి వేదిక అని కూడా ఆయన అన్నారు.

సమాంతరంగా ప్రదర్శించబడుతున్న డిజిటల్ ఎక్స్‌పో జూలై 10, 2022 వరకు పొడిగించబడింది. నిన్న 200 స్టాల్స్‌లో ఫ్యూచరిస్టిక్ డిజిటల్ సొల్యూషన్స్ మరియు ఎమర్జింగ్ టెక్నాలజీ ఉత్పత్తులను 10,000 మంది సందర్శకులు వీక్షించారు. ఈ ఎక్స్‌పో భారతదేశం అంతటా విద్యార్థులు, పరిశ్రమల ప్రముఖులు, వ్యవస్థాపకులు మరియు సామాన్య ప్రజలను ఆకర్షించింది. గిరిజన ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలలు ఉత్సాహంగా పాల్గొనడం డిజిటల్ ఎక్స్‌పోలో హైలైట్. డిజిటల్ మేళాలో డ్రోన్‌లు, ఏఆర్/వీఆర్, ఇంటరాక్టివ్ రోబోట్‌లు మరియు అత్యాధునిక భవిష్యత్తు సాంకేతికతలను స్టార్టప్‌లు ప్రదర్శించాయి.

గుజరాత్ విద్య, సైన్స్ మరియు సాంకేతికశాఖ మంత్రి శ్రీ జితుభాయ్ వాఘాని..దేశ నిర్మాణానికి 6.67 కోట్ల మంది గుజరాతీలకు మరింత సహకారం అందించేందుకు వీలు కల్పించే వేదిక ‘మైగవ్ గుజరాత్’ని ప్రారంభించారు. ఆయన సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు మరియు డిజిటల్ ఇండియా కింద కార్యక్రమాలను అమలు చేయడంలో మరియు అవలంబించడంలో మరియు పారదర్శకత, సమర్థత మరియు జవాబుదారీతనాన్ని పెంచడంలో గుజరాత్ ఛాంపియన్‌గా ఉన్నందుకు ప్రశంసించారు. గుజరాత్ ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ శ్రీ విజయ్ నెహ్రా ధన్యవాదాలు తెలిపారు.”పబ్లిక్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు ఆ సిటిజన్–సెంట్రిక్ పబ్లిక్ సర్వీసెస్”పై ఇవాళ్టి మొదటి సెషన్‌ను ఎంఈఐటీవై అదనపు కార్యదర్శి డాక్టర్ రాజేంద్ర కుమార్ మోడరేట్ చేసారు. సెషన్‌లోని ప్యానలిస్టులలో డబ్ల్యూఈఎఫ్ సలహాదారు శ్రీ ఏ. సత్యనారాయణ, సీఎస్‌సీ–ఎస్‌పివై మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ దినేష్ త్యాగి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ (ఐటీ డసీ) శ్రీ సౌరభ్ గౌర్, ప్రత్యేక కార్యదర్శి ఆ సీఈఓ శ్రీ సమీర్ విష్ణోయ్ ఉన్నారు. సిహెచ్‌ఐపీఎస్ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, శ్రీ కుమార్ వినీత్, ప్రత్యేక కార్యదర్శి (ఐటీఆఈ), ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మరియు శ్రీ అమిత్ కే సిన్హా, ఐపీఎస్, ఐటీడీపీ డైరెక్టర్, ఉత్తరాఖండ్ ప్రభుత్వం వీరిలో ఉన్నారు. పౌరులకు సాధికారత కల్పించడం, పాలనా సౌలభ్యం ఆ వ్యాపార సౌలభ్యాన్ని నిర్ధారించడం ద్వారా ప్రభుత్వ–పౌరుల రంగాల వారీగా పబ్లిక్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను నిర్మించే భారతదేశపు ప్రత్యేకమైన ప్లాట్‌ఫారైజేషన్ వ్యూహం ఎలా కీలక పాత్ర పోషిస్తుందో ప్యానలిస్టులు చర్చించారు.

”రాష్ట్రాలకు ఆధార్: ఈజ్ ఆఫ్ లివింగ్‌ను ప్రారంభించడం” అనే అంశంపై రెండవ ప్యానెల్ చర్చను యూఐడీఏఐ డీడీజీ శ్రీ అమద్ కుమార్ నిర్వహించారు మరియు శ్రీ సంతోష్ కుమార్ మాల్, ఐఏఎస్, ప్రిన్సిపల్ సెక్రటరీ (ఐటీ), బీహార్ వి. పొన్నురాజ్, ఐఏఎస్, డిపిఏఆర్, సెక్రటరీ, కర్నాటక, శ్రీ అభిజిత్ అగర్వాల్, ప్రాజెక్ట్ డైరెక్టర్, (ఎంపీ–స్వాన్) డిప్యూటీ సెక్రటరీ డీఎస్టీ, మధ్యప్రదేశ్ మరియు శ్రీ అమిత్ కే సిన్హా, ఐపీఎస్, ఉత్తరాఖండ్ ఐటీడీఏ డైరెక్టర్‌లు ఇందులో పాల్గొన్నారు. రాయితీలు, ప్రయోజనాలు ఆ ఇతర సేవలను సజావుగా అందజేయడం ద్వారా పౌరుల రోజువారీ జీవితాలను ప్రత్యేకించి అత్యంత అట్టడుగు మరియు వెనుకబడిన తరగతిని సులభతరం చేయడానికి రాష్ట్రాలు ఆధార్‌ను వివిధ మార్గాల్లో ఎలా ఉపయోగిస్తున్నాయి అనే దానిపై సెషన్‌లో చర్చ జరిగింది.

‘మెటావర్స్ మరియు వెబ్ 3.0’పై జరిగిన మూడవ ప్యానెల్ చర్చకు ఎంఈఐటీవై అదనపు కార్యదర్శి డాక్టర్ రాజేంద్ర కుమార్ అధ్యక్షత ఆ మోడరేట్ చేశారు. ప్రముఖ ప్యానెల్‌లో మెటా పబ్లిక్ పాలసీ హెడ్ శ్రీ రాజీవ్ అగర్వాల్, మైక్రోసాఫ్ట్ ఇండియా మిక్స్‌డ్ రియాలిటీ వీపీ శ్రీ శ్రీనివాస రెడ్డి, ఇండియా ఆ సౌత్ ఏషియా హెడ్ సర్వీస్ లైన్స్ శ్రీ కనిష్క అగివాల్ మరియు కంప్యూటర్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ మనీంద్ర అగర్వాల్ ఉన్నారు. ఐఐటీ కాన్పూర్‌లో సైన్స్ సెషన్‌లో మెటావర్స్ టెక్నాలజీల ప్రస్తుత ల్యాండ్‌స్కేప్, మెటావర్స్‌లో పాలసీ మరియు రెగ్యులేటరీ స్టాండర్డ్స్, వెబ్ 3.0 కోసం కెపాసిటీ బిల్డింగ్ నుండి ఈ రెండు టెక్నాలజీల ద్వారా సెక్టార్‌లలో మనం చూసే అవకాశం ఉన్న పరివర్తన వరకు అంతర్దృష్టితో కూడిన ఆలోచనల మార్పిడి మరియు అన్వేషించబడిన అంశాలతో లోడ్ చేయబడింది.నాల్గవ సెషన్ 5జీ మరియు భారతదేశం యొక్క టెకేడ్‌లో ఇంటర్నెట్ యొక్క భవిష్యత్తుపై జరిగింది. ఈ సెషన్‌కు ఎంఈఐటీవై అదనపు కార్యదర్శి డాక్టర్ రాజేంద్ర కుమార్ అధ్యక్షత ఆ మోడరేట్ చేశారు. ప్యానెల్ చర్చకు ముఖ్య వక్తలు శ్రీ ఆర్ కె పాఠక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్, డిఓటి, శ్రీ జిష్ణు అరవిందక్షణం, ప్రిన్సిపల్ ఆర్కిటెక్ట్ – సీటీఓ కార్యాలయం, తేజస్ నెట్‌వర్క్స్, శ్రీ ధివగర్ బాస్కరన్, ప్రిన్సిపల్ రీసెర్చ్ ఇంజనీర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ వైర్‌లెస్ టెక్నాలజీ, శ్రీ అభిషేక్., భాగస్వామి – ఈవై టెలికాం డొమైన్ మరియు శ్రీ రవి లఖోటియా, గవర్నింగ్ కౌన్సిల్, టీఎస్‌డీఎస్ఐ సభ్యులు ఇందులో ఉన్నారు. భారతదేశంలో ఇటీవలి 5జీ లాంచ్ గురించి ప్యానెల్ ప్రేక్షకులకు వివరించింది మరియు కనెక్టివిటీ స్పేస్‌లో కొత్త యుగం జోక్యాలను పరిచయం చేయడానికి పరిశ్రమ ఎలా అడుగులు వేస్తోందో చర్చించింది. గ్లోబల్ డెలివరీ సరఫరా గొలుసు, పరిపక్వ సరఫరాదారులు, నవీకరించబడిన ఐసీటీ మౌలిక సదుపాయాలు, అంతరాయం కలిగించే సాంకేతికతలను స్వీకరించడం, వినూత్న వ్యాపార నమూనాలు మరియు నియంత్రణ ప్రయత్నాలకు భారతదేశం యొక్క బహిర్గతం ఎలా భాగస్వామ్య సేవలకు అధిక వృద్ధి పథానికి ఎలా దారితీస్తుందో ప్యానెల్ చర్చించింది.

వైసీపీ అబద్ధపు ప్రచారమెందుకు : పవన్ కల్యాణ్

అమరావతి, జులై 8: ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం అబద్ధాల ప్రచారంపై నడుస్తుందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆరోపించారు. వైసీపీ ప్లీనరీ నిర్వహణపై ఆయన ఘాటుగా స్పందించారు. గడిచిన మూడేండ్ల పాలనలో రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని దుయ్యబట్టారు. ఏపీలో 64 లక్షల మందికి రైతు భరోసా ఇస్తున్నామని ప్రకటించి 50 లక్షల మందికే రైతు భరోసా ఇచ్చింది నిజం కాదా? అని ప్రశ్నించారు. మూడేళ్లలో 3 వేలమంది కౌలు రైతులు ఆత్మహత్య చేసుకోగా 700 మందికే ఆర్థిక సాయం అందించింది నిజం కాదా అని నిలదీశారు.

ప్రభుత్వం వద్ద నిధులు లేక ఫీజ్ రియంబర్స్ చేయక విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు ఆపేస్తుందని ఆరోపించారు. ఆరోగ్యశ్రీ నుంచి ఆస్పత్రులు ఎందుకు పక్కకు తప్పుకుంటున్నాయని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టును ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియని ప్రభుత్వమని విమర్శించారు.

మద్యంపై ఆదాయం చూపించి రూ. 8 వేల కోట్లు బ్రాండు అమ్మలేదా ? 2021–22లో రూ. 22 వేల కోట్లు సంపాదించడం ఇదేనా మద్య నిషేధమని ప్రశ్నించారు. అమ్మ ఒడి ని 43 లక్షల మందికే ఇచ్చి 83 లక్షల మందికి ఇచ్చినట్లు అబద్ధపు ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో 5లక్షల పింఛన్లు తొలగించిన మాట వాస్తవం కాదా సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు.

అర్బన్ తహశీల్దార్ రాజిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నాయకులు

రాజన్న సిరిసిల్ల, జులై 8 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ తహశీల్దార్ గా నూతన బాధ్యతలు చేపట్టిన రాజిరెడ్డి ని వారి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలేబొకే అందించి శాలువతో సత్కరించటం జరిగింది.

ఈ కార్యక్రమంలో వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి పులి రాంబాబు గౌడ్ గారు,పట్టణ అధ్యక్షుడు ముప్పిడి శ్రీధర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తీగల శేఖర్ గౌడ్, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి నదిపేట రమణ యాదవ్, టీఎన్ ఎస్ ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మోతె రాజిరెడ్డి, మైనార్టీ సెల్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ వలి, వేములవాడ మండల అధ్యక్షుడురామస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కరీంనగర్ , జులై 8: (నేటినిజం ప్రతినిధి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని శాతవాహన లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ నారాయణ రెడ్డి , లయన్ హనుమాండ్ల రాజిరెడ్డి , ఫస్ట్ వైస్ డిస్టిక్ గవర్నర్ , లయన్ యన్.వి రావు , సెకండ్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ , అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత లయన్ వి.నరేందర్ రెడ్డి , అధ్యక్షులు లయన్ మనోహర చారి , లయన్ అరవింద్ బాబు అన్నారు .శుక్రవారం స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ – టెక్నో స్కూల్లో అల్ఫోర్స్ కాలేజ్ సంస్థల అధినేత లయన్ వి . నరేందర్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి హరితోత్సవ్ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు ఈసందర్భంగావారుమాట్లాడుతూ చెట్లు మానవాళికి చాలా లాభాలు చేకూరుస్తాయని మరియు పర్యావరణ పరిరక్షణకై చేయూతనిస్తాయని తెలుపుతూ , పర్యావరణ నిబంధనలను పాటించి తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో పాల్గొనాలని చెప్పారు . ఇంట్లో తల్లిదండ్రులు వారి పిల్లల సంరక్షణకై ఏ విధమైన బాధ్యత నిర్వహిస్తారో అదే బాధ్యతను చెట్ల సంరక్షణకై నిర్వర్తించాలని చెప్పారు . నేడు ప్రపంచాన్ని అన్ని రకాలుగా పట్టి పీడిస్తున్న కరోనా మహమ్మారి బారిన పడకుండా అందరూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని మరియు ఆహారాన్ని పొందాలంటే పౌష్టికర ఆహారం అందించే చెట్లను పెంచాలని సూచించారు . ప్రత్యేకంగా సమాజంలో విద్యరంగానికి దిక్సూచిగా నిలుస్తున్న నరేందర్ రెడ్డి జన్మదినం ఇలా జరుపుకోవడం చాలా సంతోషకరమని చెప్పారు . లయన్.డా.వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నేడు తెలంగాణ రాష్ట్రంలోముఖ్యమంతి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలంగాణకు హరితహారం ప్రారంభించిన నాటి నుండి వారిని స్ఫూర్తిగా తీసుకొని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో పాటు సమాజంలో హరితహారం కార్యక్రమాన్ని ఒక పండుగగా నిర్వహించడం చాలాహర్షదాయకమని చెప్పారు . ప్రతి ఒక్కరు గౌరవ ముఖ్యమంత్రివర్యుల యొక్క ఆశయాన్ని నెరవేర్చడానికై హరిత సైనికులుగా విధులు నిర్వర్తించి చెట్ల పెంపకానికై తెలుపబడిన మార్గదర్శకాలను పాటించాలని సూచించారు . స్థానిక మంత్రి గంగుల కమలాకర్ అలాగే జిల్లా యంత్రాంగంతో కలిసి జిల్లాలో తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని రకాలుగా చేయూతనందించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు . ప్రతి ఒక్కరు చెట్ల పెంపకాన్ని బాధ్యతగా నిర్వర్తించాలని మరియు వాటి సంరక్షణకై కృషి చేసి హరిత తెలంగాణ కలను సాకారం చేయాలని కోరారు . మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయులకు మొక్కలను పంపిణీ చేశారు మరియు వాటి పరిరక్షణకై బాధ్యతను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు . ఈ కార్యక్రమంలో లయన్ అరవింద్ బాబు , లయన్ బోయినపల్లి నర్సింగ రావు , లయన్ యం.సత్యనారాయణ రావు , లయన్ చంద్రప్రకాశ్ , పాఠశాల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు .

కుందుర్తి శతజయంతి
సందర్భంగా
ఫ్రీవర్స్ ఫ్రంట్ ప్రతిభా పురస్కారాలు

తేది ||16-07-22, శనివారం || సాయంత్రం 4గం.లకు
సమావేశం: జూమ్ అంతర్జాల వేదిక

> తొలి పలుకులు - శీలా సుభద్రాదేవి

> అధ్యక్షత, కవుల పరిచయం - శ్రీ సుధామ గారు

ప్రతిభా పురస్కార స్వీకర్తలు
1) శ్రీ అడిగోపుల వేంకటరత్నంగారు
2) శ్రీ దాట్ల దేవదానం రాజుగారు
3) శ్రీ రాధేయగారు
4) శ్రీ దేవరాజు మహారాజుగారు
5) శ్రీ సీతారాం గారు
6) అనిశెట్టి రజితగారు

> పురస్కార గ్రహీతల స్పందన

> వందన సమర్పణ - కుందుర్తి కవిత
- ఫ్రీవర్స్ ఫ్రంట్

ముంబాయి ప్రాంతీయ పద్మశాలి సంఘం (రిజి)
मुंबई प्रांतीय पद्मशाली संघ (रजिस्टर्ड)
Mumbai Prantiya Padmashali Sangham (Regd.)

ఆహ్వానం

నూతనంగా ఎన్నికైన
అఖిల భారత పద్మశాలి సంఘం, అధ్యక్షులు

శ్రీ కందగట్ల స్వామి పద్మశాలి గారికి

: సన్మాన సభ :

తేది : 11.07.2022 సోమవారం, సా|| 6.30 గం||లకు
వేదిక : ఆర్య సమాజ్ హోల్,
W.Rly. వర్క్ షాప్ ఎదుట, N.M. జోషి మార్గ్, లోయల్ పరేల్, ముంబయి

అందరు ఆహ్వానితులు

సైవె రాములు
అధ్యక్షులు

యాపురం వెంకటేశ్వర్
ప్రధాన కార్యదర్శి

జేజేఎస్ నిర్మల్ జిల్లా నూతన అధ్యక్షుడిగా సీపెల్లి రవి ఎన్నిక

రాజన్న సిరిసిల్ల, జులై 8 (నేటినిజం ప్రతినిధి): స్టూడెంట్స్ సూసైడ్స్ అండ్ క్రైమ్స్ ఎరాడికేషన్ సొసైటీ ? నిర్మల్ జిల్లా నూతన అధ్యక్షులుగా సీపెల్లి రవిని ఎంపిక చేసినట్లు జెజెఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమురవెల్లి భూమేశ్ తెలిపారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని ఒక హోటల్ లో జెజెఎస్ సభ్యుల సమక్షంలో నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన సీపెల్లి రవి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా విద్యార్థుల ఆత్మహత్యలు, నేరాల నిర్మూలనపై నిర్మల్, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉచిత అవగాహన సదస్సులు, కౌన్సెలింగ్ గైడ్ లైన్స్ నిర్వహించి మాతృభూమికి నిస్వార్థంగా సేవచేస్తున్న జెజెఎస్ ఆశయ సాధన కోసం జిల్లాలో తన వంతు గా కృషి చేస్తానని తెలిపారు. ఈ ఎంపికకు సహకరించిన జిల్లా జెజెఎస్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెజెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సాయి కిరణ్ ,జిల్లా సహాయ కార్యదర్శులు గుంపుల విజయ్ కుమార్, సిహెచ్.భీమేశ్, సభ్యులు నరహరి,హరిప్రీత్ సింగ్ ,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల్లో చిరస్థాయిగా గుర్తింపు పొందిన నాయకుడు వైఎస్సార్

– వైఎస్ఆర్ జయంతి జయంతి వేడుకలు

రాజన్న సిరిసిల్ల, జులై 8 (నేటినిజం ప్రతినిధి): దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేదప్రజల చిరస్థాయిగా నిలిచిన గొప్ప నాయకుడని కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ కొనియాడారు మశుక్రవారం వేములవాడ పట్టణం ఆది శీనన్న నివాసంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి 73వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాంతానికి ఎనలేని సేవ చేశాడని అలాంటి గొప్పమహనీయుడుచనిపోవడం చాలా బాధాకరమని ఆయన అన్నారు. ప్రతి పేదవాడి గుండెల్లో చెరగని ముద్ర వేసుకొని ఉన్నటువంటి ఏకైక వ్యక్తి రాజశేఖర్ రెడ్డి అని ఆయన కొనియాడారు. మన మధ్యలో లేకపోవడం చాలా బాధాకరమని తీరని లోటు అని ఆయన అన్నారు పేద ప్రజల గుండెల్లో చిరకాలం గుర్తుండిపోయే గొప్ప నాయకుడని ఆది శ్రీనివాస్ కొనియాడారు .వేములవాడ నియోజకవర్గానికి రాజశేఖర్ రెడ్డి జూనియర్ కాలేజీలను మంజూరు చేసినటువంటి ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని ఆయన గుర్తు చేశారు. ఈ ప్రాంతానికి సాగునీరుఅందించినటువంటి వ్యక్తి రాజశేఖర్ రెడ్డి అని ఆయన గుర్తు చేశారుఅగ్రహారం డిగ్రీ కాలేజ్ కి సైన్స్ మంజూరు చేసినటువంటి వ్యక్తి రాజశేఖర్ రెడ్డి అని అలాంటి గొప్ప వ్యక్తి మన మధ్య లేకపోవడం తీరని లోటు అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అర్బన్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి పిల్లి కనకయ్య నాయకులు చిలుక రమేష్, సంఘ స్వామి యాదవ్, కూరగాయల కొమరయ్య, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, ముడిగే చంద్రశేఖర్, కనికరపు రాకేష్, కత్తి కనకయ్య, నాగుల రాము గౌడ్, నాగుల విష్ణు, అక్కనపల్లి నరేష్, నరేందర్, తదితరులు ఉన్నారు.

ఎలివేటర్ ఇండస్ట్రీ ఎక్స్‌పో 2022' 1 నుండి 3 డిసెంబర్లో ముంబైలో.

హైదరాబాద్, జులై 8: భారతదేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఎలివేటర్ మార్కెట్. ఎలివేటర్ ఉ ఎస్కలేటర్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రకారం, ప్రపంచ ఎలివేటర్ మార్కెట్‌లో భారతదేశం 7% కంటే ఎక్కువ వాటా కలిగి ఉండగా, ఇది ప్రపంచ ఎలివేటర్ ఎగుమతులకు 0.25% కంటే తక్కువ దోహదం చేస్తుంది. మద్రాస్ కన్సల్టెన్సీ గ్రూప్ ప్రకారం, భారతదేశం 300 మిలియన్ విలువైన ఎలివేటర్ భాగాలను దిగుమతి చేస్తుంది. 65%తో చైనా ప్రాథమిక లబ్ధిదారు.ఎగుమతులు మరియు దిగుమతులకు సంబంధించిన క్రమరాహిత్యాన్ని సరిదిద్దే లక్ష్యంతో ఎలివేటర్లు మరియు ఎస్కలేటర్ల కోసం అంతర్జాతీయ సోర్సింగ్ ఎక్స్‌పోజిషన్ ప్రారంభించబడింది. ఎలివేటర్లు మరియు ఎస్కలేటర్‌ల కోసం భారతదేశాన్ని గ్లోబల్ సోర్సింగ్ హబ్‌గా ఉంచడం మరియు పరిశ్రమ చైనాపై ఆధారపడటాన్ని తగ్గించడం యొక్క ప్రాథమిక లక్ష్యం. ఎలివేటర్లు, ఎస్కలేటర్ల కోసం ఇంటర్నేషనల్ సోర్సింగ్ ఎక్స్‌పోజిషన్ 1, 2, 3 డిసెంబర్, 2022న నిర్వహించబడుతుంది. వేదిక బొంబాయి ఎగ్జిబిషన్ సెంటర్, , గోరేగావ్ (తూర్పు), ముంబై, భారతదేశంలో. ఎలివేటర్ పరిశ్రమ కలుస్తుంది మరియు గొప్ప నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫారమ్‌గా ఉంటుందని హామీ ఇచ్చింది. సినర్జిస్టిక్‌గా కాంపోనెంట్ తయారీదారులను ఒకచోట చేర్చే ఏకైక ఖచ్చితమైన వివరణ ఇది.

వంట గ్యాస్ ధరలు తగ్గించకపోతే మరో పోరాటం తప్పదు : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబాబాద్, జులై 8(నేటినిజం ప్రతినిధి): ప్రపంచంలో ఎక్కడలేని విధంగా వంట గ్యాస్ ధరలు మన దేశంలోనే ఆకాశాన్నంటాయని మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. వంట గ్యాస్ ధరలు తగ్గించకపోతే మరో పోరాటం తప్పదని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ఎనిమిదేండ్లలో వంట గ్యాస్ ధరలు నాలుగు రెట్లు పెంచి పేదల నడ్డి విరిచారని మండిపడ్డారు. వంట గ్యాస్ ధరల పెంపునకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాలని.. టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మహబూబ్ నగర్ తెలంగాణ చౌరస్తాలో నిర్వహించిన ధర్నాలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొని ప్రసంగించారు.

ఈ ఎనిమిదేండ్లలో గ్యాస్ ధరలు దాదాపు నాలుగు రెట్లు పెంచారని తెలిపారు. 2014లో రూ.450 ఉండగా ఇప్పుడు రూ. 1100 కు పైగా దాటిందని గుర్తు చేశారు. సబ్సిడీగా ఇస్తున్న రూ.240ను కూడా దశలవారీగా ఎత్తేసి పేదలపై ఊహించని భారం మోపారని మంత్రి మండిపడ్డారు. కూలీలు, చిరుద్యోగులు తాము సంపాదించిన దాంట్లో కనీసం 10 శాతానికి పైగా వంట గ్యాస్, పెట్రోలోకే ఖర్చు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. కేంద్రం ప్రజా వ్యతిరేక పాలనపై రాష్ట్రాలు ప్రశ్నిస్తే, బెదిరింపులకు పాల్పడుతూ ఈడీ ద్వారా వేధింపులకు గురి చేస్తూ నోరెత్తకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి శ్రీనివాస్ గౌడ్ ధ్వజమెత్తారు.

ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు కొరమోని నరసింహులు, బస్వరాజు గౌడ్ లక్ష్మీ, మూడా చైర్మన్ గంజి వెంకన్న ముదిరాజ్, డిసిసిబి వైస్ చైర్మన్, కొరమోని వెంకటయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రెహమాన్, మత్స్య సహకార సంఘం చైర్మన్ సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్ యాదవ్, జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, జేపీఎన్సీ చైర్మన్ రవికుమార్, పార్టీ నాయకులు వినోద్, శివరాజు తదితరులతో పెద్ద ఎత్తున మహిళలు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తు కోసం విద్యార్థులు కష్టపడి చదవాలి

–కౌన్సిలర్ మారం కుమార్

–కేజీబీవి విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణ

రాజన్న సిరిసిల్ల, జులై 8 (నేటినిజం ప్రతినిధి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని కౌన్సిలర్ మారన్ కుమార్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని 4వ వార్డులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినిలకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా మారం కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కొట్లాడి సాధించుకున్న తరుణంలో ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యార్థినిల చదువులకు అన్ని వసతులు కల్పించారని అన్నారు. ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు ఆధ్వర్యంలో కేజీబీవి పాఠశాలను నిర్మించుకున్నామని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు, క్రీడారంగంలో కూడా ముందుండాలని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సప్న, అధ్యాపకబృందం పాల్గొన్నారు.

త్యాగం లేకపోతే వ్యర్థం: ఈటల

హైదరాబాద్, జులై 8:: మానవ సమాజం త్యాగాల పునాదులపై ఏర్పడిందని, త్యాగం లేకపోతే వ్యర్థమని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. ఐ స్టాండ్ ఫర్ వారియర్స్ కార్యక్రమంలో ఈటల పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయహో ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎందరో పుడతారు, చస్తారు.. కానీ కొందరే గుర్తుంటారని పేర్కొన్నారు. త్యాగధనులను గుర్తు చేసుకోవాలని సూచించారు. ఆగస్ట్ 15న మధ్యాహ్నం 12 గంటలకు దేశ ప్రజలంతా లేచి నిలబడి, జాతీయ గీతం ఆలాపించాలని ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు.

నేరస్తులకు శిక్ష పడేలా పోలీసు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి

–జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

–పోలీస్ అధికారులతో ఎస్పీ సమీక్ష

నేటి నిజం రాజన్నసిరిసిల్ల ప్రతినిధి జులై 8: జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పెండింగ్ కేసులు, ఫంక్షనల్ వర్టికల్స్, రాబోవు బక్రీద్, బోనాల పండుగలపై జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం ఎస్పీ రాహుల్ హెగ్డే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని పోలీస్టేషన్లలో పెండింగులో ఉన్న కేసుల వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగులో ఉన్న కేసులను సత్వరమే పరిష్కారానికి కృషి చేయాలని, ప్రతి కేసులో నేరస్తులకు శిక్ష పడేలా పోలీసు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి అధికారులకు ఆదేశించారు. అనంతరముఎస్పీమాట్లాడుతూబక్రీద్, బోనాల పండుగల సందర్భంగా దేవాలయాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించే ప్రాంతాల్లో బందోబస్తు, ట్రాఫిక్, ఇతర అంశాలపై పోలీసులు దృష్టి సారించాలనితెలిపారు. బక్రీద్ రోజు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో బందో బస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. పశువుల అక్రమ రవాణా విషయంలో పశు సంవర్ధకశాఖఅధికారులతో సమన్వయం చేసుకుంటూ అక్రమ రవాణా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. జిల్లాల సరిహద్దుల వద్ద, జిల్లా కేంద్రాలలో చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని, తరచూ తనిఖీలు నిర్వహిస్తూ పశువుల అక్రమ రవాణా అడ్డుకోవాలని అన్నారు.

సమగ్ర విచారణ ద్వార నిందితులకు శిక్షపడేవిధంగా చేసి బాధితులకు న్యాయం చేకూరేలా అధికారులు అందరూ బాధ్యతగా వ్యవహరించాలనిసూచించారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ త్వరితగతిన న్యాయస్థానం ద్వార తీర్పు వెలువడేలా చేసి శిక్షల రేటును పెంచాలని కోరారు.సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేసి, ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఏ విధంగా నేరాలకు పాల్పడుతున్నారో వివరిస్తూ ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు.డ్రగ్స్,గంజాయి,గుట్కా లాంటి మత్తు పదార్థాలను సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్లలో ఏకీకృత సేవలను విస్తరింప చేయడం లక్ష్యంగా ప్రవేశపెట్టిన ఫంక్షనల్ వర్టికల్స్ అమలు తీరును ఈ సందర్భంగా పరిశీలించారు. అనంతరం ఫంక్షనల్ వర్టికల్స్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు సిబ్బందికి ప్రశంశ పత్రాలు ఈ సందర్భంగా అందజేశారు. అనంతరం

ముస్తాబద్ ఎస్సై ఎస్టేజ్ఓ వర్టికల్ వెంకటేశ్వర్లు, ఎల్లారెడ్డిపేట్ ఎస్సై ఇన్వెస్టిగేషన్ వర్టికల్ శేఖర్, వేములవాడ రూరల్ వారెంట్ వర్టికల్ విజేయ్ కుమార్, మోహన్ (కొనరావుపేట), సమ్మన్స్ వర్టికల్× దామోదర్ (ముస్తాబద్ పోలీస్ స్టేషన్), యాకుబ్ (ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్), టెక్ టీమ్ వర్టికల్ రమేశ్ (ఇల్లంతకుంట), కమ్యూనిటీ పోలీసింగ్ వర్టికల్ కిషన్ రావు(ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్), నరేష్ నాయక్ (బోయినపల్లి), సెక్షన్ ఇంచార్జ్ వర్టికల్ ఏఎస్ఐ కాజా జమాలొద్దిన్ (సిరిసిల్ల టౌన్) రిసెప్షన్ వర్టికల్ సంపత్ (వేములవాడ టౌన్),

కోర్ట్ వర్టికల్ (మహేందర్ సిరిసిల్ల టౌన్), స్టేషన్ రైటర్ వర్టికల్ రాజు (ముస్తాబద్)

ట్రాఫిక్ వర్టికల్ స్వామి (సిరిసిల్ల టౌన్) లకు ప్రశంస పత్రాలు అందజేశారు.

ఈ సమావేశంలో డిఎస్పీ లు నాగేంద్రచారి, రవికుమార్, సిఐలు అనిల్ కుమార్, ఉపేందర్, మోగిలి, వెంకటేష్, బన్సీలాల్, శ్రీలత, నవీన్ కుమార్, సర్వర్, లింగమూర్తి, ఆర్ఐలు కుమారస్వామి, రజనీకాంత్, యాదగిరి, ఎస్ఐలు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో పుస్తకాల పంపిణీ

రాజన్న సిరిసిల్ల, జులై 8 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం అనుపురంలో జెడ్పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం జడ్పీటీసీ మ్యాకల రవిపాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిదిగా ఆయన హాజరైయ్యారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన మన ఊరు మన బడి కార్యక్రమంలో స్కూల్స్ లో ఉన్న మౌళిక సదుపాయం కల్పిస్తూ, ఈ సంవత్సరం నుండి విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టింది అన్నారు. విద్యార్థుల సౌలభ్యం కోసం ఇంగ్లీష్ టూ తెలుగు పుస్తకాలు చేసి పంపిణి చేసిందన్నారు. విద్యార్థులు ఇట్టి అవకాశంను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండపల్లి వెంకటరమణ రావు, ఎంపీటీసీ బాస రాజశేఖర్, ఎస్ఎంసి చైర్మన్ మెరుగు శ్రీనివాస్ గౌడ్, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు దశరథం,కవిత, రజిత, సునీత, పద్మ, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి రెడీగా కలెక్టరేట్ నూతన భవనం.. ఖమ్మంలో అన్ని ఏర్పాట్లు పూర్తి

ఖమ్మం, జులై 8: (నేటినిజం ప్రతినిధి): పరిపాలనా సౌలభ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం అయిన నూతన కలెక్టరేట్ భవనం ప్రారంభోత్సవానికి రెడీ అయ్యింది. ఈ మేరకు మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, సత్యవతి రాథోడ్ శుక్రవారం నూతన కలెక్టరేట్ ను పరిశీలించారు. భవన నిర్మాణం, ప్రాంగణానికి సంబంధించిన పలు పనులను పరిశీలించారు. నూతన కలెక్టరేట్ భవన నిర్మాణాన్ని 55 కోట్లతో చేపడుతున్నామని, నిర్మాణం పనులు పూర్తి స్థాయిలో కంప్లీట్? అయ్యాయని, ఫర్నీచర్ కూడా సమకూర్చడం జరిగిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ మంత్రులకు వివరించారు.

మంత్రులు, అధికారులు భవనం మొత్తం కలియతిరిగారు. విద్యుత్ పనులు, ప్లాన్ల ఏర్పాటు, డ్రైనేజీ, నీటి సరఫరా, పార్కింగ్, గ్రీనరీ, జాతీయ జెండా ప్రాంగణం, టైల్స్ పనులు పూర్తి అయ్యాయని ఈ సందర్భంగా కలెక్టర్? వారికి వివరించారు. ఆయా పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి రెడీ చేసిన జిల్లా కలెక్టర్ ను మంత్రి పువ్వాడ అభినందించారు.

మృతుడు ఏగిన మారుతి కుటుంబాన్ని పరామర్శించిన ఏనుగు మనోహర్రెడ్డి

రాజన్న సిరిసిల్ల, జులై 8 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో ఇటీవల మరణించిన ఏగిన మారుతి కుటుంబ సభ్యులను శుక్రవారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తెరాస సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు .ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ఆయన వెంట పైడి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు .

టెక్-ఎనేబుల్డ్ హోమ్‌బిల్డర్ బిల్డ్ నెక్ట్స్ పిడిలైట్ నేతృత్వంలో నిధుల వి3.5 మిలియన్ల సమీకరణ

హైదరాబాద్, జులై 8: బిల్డ్‌నెక్ట్స్ ఈ నిధులను ఇంటి డిజైన్ నిర్మాణం కోసం ఆర్ అండ్ డిలో మరింత పెట్టుబడి పెట్టడానికి బెంగళూరు, చెన్నై

buildnext

కోయంబత్తూర్ కొత్త మార్కెట్‌లలోకి విస్తరించేందుకు ఉపయోగించనుందిహైదరాబాద్, 8 జూలై, 2022 – బిల్డ్ నెక్ట్స్, కొచ్చి ఆధారిత టెక్–ఎనేబుల్డ్ హోమ్‌బిల్డర్, పిడిలైట్ ఇండస్ట్రీస్ పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థ – మధుమల వెంచర్స్ నేతృత్వంలోని 'ప్రీ–సిరీస్ ఎ' ఫండింగ్‌లో వి 3.5 మిలియన్లను సేకరించింది. బిల్డ్‌నెక్ట్స్ ఇప్పటికే ఉన్న పెట్టుబడిదారులైన కొంగ్లో వెంచర్స్, వినీత్ కుమార్ సిఇఓ దీప్ గుప్తా నుండి నిధులను పొందింది. బిల్డ్‌నెక్ట్స్ దాని ఆర్ అండ్ డి సామర్థ్యాలను మరింత విస్తరించడానికి దాని వర్చువల్ రియాలిటీ టెక్నాలజీ అనుభవ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయడానికి తాజా రౌండ్ నిధుల నుండి మూలధనాన్ని ఉపయోగిస్తుంది. "పిడిలైట్‌ను మా ముఖ్య పెట్టుబడిదారులలో ఒకరిగా కలిగి ఉన్నందుకు మేము సంతోషిస్తున్నాము. ఇంటిని నిర్మించే రూపకల్పన చేసే మొత్తం ప్రక్రియలో పారదర్శకత, అసమర్థతలను అధిగమించడానికి మా అనుకూల సాంకేతిక ప్లాట్‌ఫారమ్‌ను ఉపయోగించడం మా లక్ష్యం. మెరుగైన గృహాల రూపకల్పన, నిర్మాణం గురించి పరిశోధనలో మేము గణనీయమైన పురోగతిని సాధించాము. ఇంటి డిజైన్ ఎంత మంచిదో నిర్ణయించడానికి మేము ఆబ్జెక్టివ్ పారామితులను అభివృద్ధి చేసాము మరియు నిరంతర అభివృద్ధి కోసం వీటిని ప్రతిరోజూ మళ్లీ మళ్లీ పరీక్షించడం జరుగుతుంది. అంతరిక్షంలో దశాబ్దాల నాయకత్వంతో, ఈ ప్రయాణంలో పిడిలైట్ యొక్క మార్గదర్శకత్వం మాకు పెద్ద ఆస్తిగా ఉంటుంది మరియు మేము విశ్వాసంతో ముందుకు సాగడానికి వీలు కల్పిస్తుంది. బిల్డ్‌నెక్ట్స్ సహ వ్యవస్థాపకుడు మరియు సిఇఓ గోపీ కృష్ణన్‌ను తాము విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. బిల్డ్‌నెక్ట్స్ దాని టార్గెట్ మార్కెట్‌ను 1–5 అంతస్తుల సింగిల్ లేదా బహుళ–ఫ్యామిలీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌లుగా గుర్తిస్తుంది, ఒక్కో ఇంటికి 1500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రారంభమవుతుంది. బిల్డ్‌నెక్ట్స్ కస్టమర్‌లకు పూర్తి అనుకూలీకరణ, విఆర్ కార్యకలాపాల కోసం ఎర్గోనామిక్, సౌందర్య డిజైన్‌లతో సహా డిజైన్ నుండి హ్యాండ్‌ఓవర్ వరకు ప్రీమియం నిర్మాణ అనుభవాన్ని అందిస్తుంది.ఇతర పరిశ్రమకు సాంకేతికత డేటా తెచ్చిన ప్రయోజనాలు చాలా ఉన్నప్పటికీ, గృహాల నిర్మాణం ఇప్పటికీ సాంకేతికంగా సమన్వయం లేకుండా ఉంది, అసమర్థ–ప్రక్రియ ఆధారిత మరియు వృత్తాంత సాక్ష్యాలను ఉపయోగిస్తుంది, ముఖ్యంగా తక్కువ–ఎత్తున విభాగంలో. ఇది వినియోగదారులకు ఖర్చు సమయం పెరుగుదల, నాణ్యత ఆందోళనలకు దారితీస్తుంది. డేటా మరియు సాంకేతికతను విలీనం చేయడం ద్వారా వారు మెరుగైన గృహాలను నిర్మించగలరని బిల్డ్‌నెక్ట్స్ విశ్వసిస్తోందని గోపి కృష్ణన్ అన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.